# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

సంపుటి : 1 సంచిక : 56 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కావలి, నెల్లూరుజిల్లా బుధవారం 7 జనవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 56 PAGES : 8 EDITOR : G A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAVALI, NELLORE DIST, WED 7 JANUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : ,SPSR Nellore, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa, Hyderabad, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


# 2026లోనూ పెట్టుబడుల ఫ్లో ఏపీ వైపే ఉండాలి

- సీఎం అధ్యక్షతన పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) సమావేశం
- అధికారులకు చంద్రబాబు దిశానిర్దేశం
- టీమ్ వర్క్ తోనే గతేడాది ఉత్తమ ఫలితాలు సాధించామని వెల్లడి
- ఇకమీదట కూడా అదే జోరు కొనసాగించాలని సూచన



పెన్ పవర్ డెస్క్:2025లో సాధించిన విజయాలను స్ఫూర్తిగా తీసుకుని, 2026లోనూ అదే ఉత్సాహంతో పనిచేసి ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులకు ప్రధాన గమ్యస్థానంగా నిలపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. టీమ్ వర్క్‌తో పనిచేయడం వల్లే గతేడాది ఉత్తమ ఫలితాలు సాధించామని, ఇదే జోరును రానున్న కాలంలోనూ కొనసాగించాలని మంత్రులకు, అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ ఏడాది కూడా పెట్టుబడుల ప్రవాహం మన రాష్ట్రం వైపే ఉండాలని అన్నారు. మంగళవారం నాడు సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన 14వ రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) సమావేశంలో రూ.19,391 కోట్ల విలువైన పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. ఈ పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో 11,753 మందికి కొత్తగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.సమావేశం ప్రారంభంలో మంత్రులు, అధికారులు ముఖ్యమంత్రికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, "2025లో అందరం కలిసికట్టుగా పనిచేయడం వల్లే రాష్ట్రానికి తిరిగి బ్రాండ్ ఇమేజ్ వచ్చింది. గత ప్రభుత్వ హయాంలో దెబ్బతిన్న ప్రతిష్టను పునరుద్ధరించి, గూగుల్, టాటా, జిందాల్, అదానీ, రిలయన్స్ వంటి దిగ్గజ సంస్థలను రాష్ట్రానికి తీసుకురాగలిగాం. ఈ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలి," అని స్పష్టం చేశారు.

**పర్యాటక రంగ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి**

రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. "సూర్యలంక అత్యంత సురక్షితమైన బీచ్. దాని అభివృద్ధికి ఒక మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలి. 15 కిలోమీటర్ల మేర కాలుష్య రహిత బీచ్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేసి, రిసార్ట్స్‌కు బ్రాండింగ్ కల్పించాలి. మాల్దీవుల తరహాలో సూళ్లూరుపేట సమీపంలోని చిన్న చిన్న ద్వీపాలను 'ఐల్యాండ్ టూరిజం'గా

వివరాలు 2లో..

## కాశీ ఎక్స్‌ప్రెస్ కు బాంబు బెదిరింపు



- గోరఖ్‌పూర్ నుంచి ముంబైకి ప్రయాణిస్తున్న రైలుకు బాంబు బెదిరింపు
- 'మౌ' స్టేషన్‌లో రైలును నిలిపి తనిఖీలు నిర్వహించిన అధికారులు
- ఎలాంటి అనుమానిత వస్తువులు లభ్యం కాలేదని వెల్లడి

వివరాలు 2లో..

## వెనెజువెలా సంక్షోభం... భారత్‌కు మేలు చేస్తుందంటున్న నిపుణులు!

- వెనెజువెలా సంక్షోభంతో భారత్ ఆయిల్ బిల్లుపై తక్షణ ప్రభావం ఉండదన్న నిపుణులు
- ప్రపంచవ్యాప్తంగా క్రూడ్ ఆయిల్ సరఫరాలు మిగులు స్థాయిలో ఉన్నాయని వెల్లడి
- ఇతర దేశాలతో పోలిస్తే వెనెజువెలా నుంచి భారత్‌కు తక్కువ ధరకే చమురు
- అమెరికా జోక్యంతో భవిష్యత్తులో ధరలు తగ్గే అవకాశం ఉందని అంచనా

వివరాలు 2లో..






## ఏపీలో 14 కొత్త ప్రాజెక్టులు ఇవే... గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన ఎస్ఐపీబీ

- సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన 14వ ఎస్ఐపీబీ సమావేశం
- రాష్ట్రంలో రూ.19,391 కోట్ల విలువైన 14 ప్రాజెక్టులకు ఆమోదం
- కొత్త పరిశ్రమల ద్వారా 11,753 మందికి ఉద్యోగ అవకాశాలు
- ఇంధనం, పర్యాటకం, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో భారీ పెట్టుబడులు

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక ప్రగతిని వేగవంతం చేసే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) 14వ సమావేశంలో భారీ పెట్టుబడులకు ఆమోదం లభించింది. ఈ సమావేశంలో మొత్తం రూ.19,391 కోట్ల విలువైన 14 ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. వీటి ద్వారా రాష్ట్రంలో 11,753 మందికి కొత్తగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.

**ఆమోదించిన పెట్టుబడులు, ఉద్యోగాల వివరాలివే...**

ఆర్ణ కోస్టల్ రిసార్ట్స్-బాపట్ల జిల్లా-రూ. 187.58 కోట్లు-250 ఉద్యోగాలు

సైవెన్, యూనిఫై కన్సార్షియం-బాపట్ల జిల్లా-రూ. 183.87 కోట్లు-196 ఉద్యోగాలు

శుభం, ఇంద్రనీర్ కన్సార్షియం-బాపట్ల జిల్లా-రూ. 64.44 కోట్లు-100 ఉద్యోగాలు

ఇస్కాన్-సత్యసాయి జిల్లా- రూ. 425.20 కోట్లు-1035 ఉద్యోగాలు

సంఘం మిల్క్ ప్రొడ్యూసర్స్-అనంతపురం జిల్లా -రూ. 200.82 కోట్లు-245 ఉద్యోగాలు

నవ ఫుడ్ సెంటర్-తిరుపతి జిల్లా- రూ. 44.42 కోట్లు-500 ఉద్యోగాలు

వివరాలు 2లో..

## వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఈ సమస్య

- సుబ్బరాయసాగర్ ప్రాజెక్టుకు నీరు ఎప్పుడో రావాల్సిందన్న జేసీ
- వైసీపీ పాలకులు గేట్లు కనీసం గ్రీజు కూడా పూయలేదని మండిపాటు
- పెద్దారెడ్డి, ఆయన కొడుకులు ఎక్కడకు వెళ్లారని ప్రశ్న



పెన్ పవర్ డెస్క్:అనంతపురం జిల్లాలో సుబ్బరాయసాగర్ ప్రాజెక్ట్‌కి నీటి విడుదలలో ఆలస్యం జరిగిందని, అది గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే అని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి ఆరోపించారు. అనంతపురంలోని లక్ష్మీనగర్‌లో తన ఇంట్లో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

వివరాలు 2లో..

## మదురో లాగే ప్రధాని మోదీని ట్రంప్ కిడ్నాప్ చేస్తారా?



- పృథ్వీరాజ్ చవాన్ వ్యాఖ్యలపై నెటిజన్లు ఆగ్రహం
- వెనెజువెలా సంక్షోభంపై మోదీ మౌనంగా ఉన్నారని ఆరోపణ
- మదురోను కిడ్నాప్ చేసినట్లుగా, మరే దేశాధినేతకైనా ఇలా జరగవచ్చని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:వెనెజువెలాలో నికోలస్ మదురోకు జరిగినట్లుగా భారతదేశంలో కూడా జరుగుతుందా? అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మన ప్రధానమంత్రిని కూడా కిడ్నాప్ చేస్తారా? అని మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పృథ్వీరాజ్ చవాన్ ప్రశ్నించారు. ఆయన చేసిన

వివరాలు 2లో..

## కోనసీమలో ఓఎన్జీసీ గ్యాస్ బ్లోఅవుట్... ఇంకా అదుపులోకి రాని మంటలు

- కోనసీమ జిల్లా ఇరుసుమండలో ఓఎన్‌జీసీ బావి బ్లోఅవుట్
- రెండో రోజూ అదుపులోకి రాని మంటలు
- భద్రతా చర్యల్లో భాగంగా 500 కుటుంబాల తరలింపు
- సీఎం, డిప్యూటీ సీఎం పరిస్థితిని సమీక్షిస్తున్నారని తెలిపిన ఎంపీ

వివరాలు 2లో..



పెన్ పవర్ డెస్క్:కోనసీమ జిల్లా మలికిపురం మండలం ఇరుసుమండ గ్రామంలోని ఓఎన్‌జీసీ బావిలో చెలరేగిన మంటలు రెం డో రోజు కూడా అదుపులోకి రాలేదు. సోమవారం మధ్యాహ్నం మోరి-5 బావిలో

## భారీ భూకంపానికి చిగురుటాకులా వణికిన జపాన్?

- రిక్టర్ స్కేలుపై 6.2 పాయింట్ల తీవ్రత నమోదు
- ఊగిపోయిన భవనాలు, మెట్రో రైల్ స్టేషన్లు
- ప్రాణనష్టం జరగలేదని అధికారుల వెల్లడి



పెన్ పవర్ డెస్క్:జపాన్ లో భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత 6.2 గా నమోదైంది. మంగళవారం ఉదయం పదిన్నర గంటల ప్రాంతంలో ఒక్కసారిగా భూమి కంపించింది. చుగోకు రీజియన్ లోని షిమానే ప్రిఫెక్చర్ లో భూకంప ప్రభావం ఎక్కువగా ఉందని అధికారులు తెలిపారు. భూ ప్రకంపనలు తీవ్రంగా

వివరాలు 2లో..

## భోగాపురం ఎయిర్‌పోర్ట్ ఘనత మాదే: వైసీపీకి పీవీఎన్ మాధవ్ కౌంటర్

- భోగాపురం ఎయిర్‌పోర్ట్ ఘనత నూటికి నూరు శాతం కూటమిదేనన్న పీవీఎన్ మాధవ్
- వైసీపీ హయాంలో రాష్ట్రంలో అరాచకం సృష్టించారని విమర్శ
- కుప్పం వరకు హంద్రీనీవా నీళ్లు అందిస్తామని హామీ
- ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులు వేగవంతం చేస్తామని వెల్లడి



పెన్ పవర్ డెస్క్:భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఘనత తమదేనంటూ వైసీపీ నేతలు చేస్తున్న ప్రచారాన్ని ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తీవ్రంగా ఖండించారు. ఆ ఎయిర్‌పోర్ట్ ఘనత నూటికి నూరు శాతం కూటమి ప్రభుత్వానిదేనని, ఇందులో ఎలాంటి సందేహం లేదని ఆయన మంగళవారం విశాఖపట్నంలో స్పష్టం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో అరాచకాన్ని సృష్టించి, సంపదను నాశనం చేసిందని మాధవ్ ఆరోపించారు. ఇప్పుడు అన్నీ తామే చేశామని చెప్పుకోవడం

వివరాలు 2లో..

## కేంద్ర బడ్జెట్ 2026 తేదీపై సందిగ్ధత.. ఫిబ్రవరి 1న ప్రవేశపెడతారా?

- 2026 కేంద్ర బడ్జెట్ తేదీపై నెలకొన్న గందరగోళం
- ఫిబ్రవరి 1 ఆదివారం కావడంతో తేదీ మార్పుపై చర్చ
- గతంలోనూ వారాంతాల్లో బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భాలు
- తుది నిర్ణయం పార్లమెంటరీ వ్యవహారాల కమిటీదేనని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టనున్న 2026 కేంద్ర బడ్జెట్ తేదీపై ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఆసక్తికర చర్చ జరుగుతోంది. 2017 నుంచి ఏటా ఫిబ్రవరి 1న బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం సంప్రదాయంగా వస్తోంది. అయితే 2026లో ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారం కావడంతో బడ్జెట్ ప్రవేశపెట్టే తేదీ మారుతుందా? లేదా? అనే దానిపై సందిగ్ధత నెలకొంది. ప్రభుత్వం బడ్జెట్‌ను ఫిబ్రవరి 2న ప్రవేశపెట్టవచ్చని కొన్ని ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

**వారాంతంలో బడ్జెట్ కొత్తేమీ కాదు**

బడ్జెట్‌ను వారాంతంలో ప్రవేశపెట్టడం ఇదే మొదటిసారి కాదు. గతంలో కూడా ఇలాంటి సందర్భాలు ఉన్నాయి. 2025లో బడ్జెట్‌ను శనివారం నాడు ప్రవేశపెట్టారు.

వివరాలు 2లో..



## ఎడిటర్ వ్యూ

# వెనెజువలా దేశ ఉత్థానపతనాలు

దక్షిణ అమెరికా ఉత్తర సముద్ర తీరాన ఉన్న "వెనెజువెలా బోలివారియా గణతంత్ర" దేశం ఉనికి, స్వేచ్ఛ నేడు ప్రమాదంలో పడింది. అమెరికా దురహంకారానికి, దురాక్రమణ కోరల్లో చిక్కి విలవిల్లాడుతుంది. ఏడు యుద్ధాలు ఆపానని ప్రకటించుకున్న ట్రంప్ ప్రభుత్వం నోబెల్ శాంతి బహుమతిని కోరుకుంటూనే ఏడు దేశాలపై బాంబుల వర్షం కురిపించారు. ఇప్పటి వరకు శాంతి మంత్రం జనించిన ట్రంప్ నేడు ప్రపంచ అశాంతికి ఆజ్యం పోస్తున్నాడు. సహజ వనరులు అధికంగా ఉన్న చిన్న దేశాలను ఆంక్షల కౌగిలిలో బంధించి ఊపిరి తీసినంత పని చేస్తున్నారు. వెనెజువెలా వద్ద ఉన్న పుష్కల చమురు నిల్వలపై దొంగ కన్నేసిన ట్రంప్ ఏకంగా ఆ దేశ అధ్యక్షుడు  నికొలస్ మదురోను బంధించి, సులభంగా ఆ దేశాన్ని దురాక్రమణ చీకట్లలోకి నెట్టేసి, అంతర్జాతీయ చట్టాల కట్టుబాట్లను తుంగలో తొక్కి, ఆ దేశ సార్వభౌమత్వాన్ని కబళించే అన్యాయానికి ఒడిగడుతూ, ఆయన్ను అమెరికా కోర్టులో ప్రవేశ పడుతున్నాడు. ఈ దురాక్రమణలో అమెరికా సైన్యం చేసిన దాడిలో వెనెజువెలా సైనికులు, పౌర సమాజం కూడా మరణించ వచ్చని అంచనా వేస్తున్నారు. విశ్వశాంతికి ఊపిరిలూదే దేశమే శాంతి దీపాన్ని ఆర్పటానికి ప్రత్యక్ష చర్యలకు పూనుకున్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, మానవ వలసలు లాంటి కారణాలను చూపి, తెర వెనుక చమురు దోచుకునే దుర్బుద్ధిని బయట పెట్టారు.

వెనెజువెలా చరిత్ర గమనం:

కారకస్ రాజధానిగా స్పానిష్ భాష మాట్లాడే వెనుజువెలా 1999 నుంచి ఫెడరల్ అధ్యక్ష తరహా రాజ్యాంగం పునాదిగా నడుస్తున్నది. 3.2 కోట్ల జనాభా కలిగిన వెనెజువెలా దేశానికి సరిహద్దుల్లో కొలంబియా, బ్రెజిల్, గయానా, ట్రినిడాడ్-టొబాగో దేశాలు ఉన్నాయి. జీవవైవిధ్యంలో 7వ దేశంగా పేరొందిన వెనెజువెలా దేశం అతి పెద్ద చమురు నిల్వలు ఉన్న దేశంగా పేరు తెచ్చుకుంది. అత్యంత ఎత్తైన ఏంజెల్స్ జలపాతం కలిగిన వెనుదువెలా 1522లో స్పెయిన్ కాలనీ రాజ్యంగా ఉండేది. 1811 ముందు ఫ్రెచ్ అమెరికన్ కాలనీగా ఉన్న దేశం ఆ తర్వాత "ఫస్ట్ రిపబ్లిక్ ఆఫ్ వెనెజువెలా"గా ప్రకటించబడింది. అయినప్పటికీ "ఫెడరల్ రిపబ్లిక్ ఆఫ్ కొలంబియా"లో శాఖగా ఉండేది. 1830లో స్వతంత్ర దేశంగా అవతరించి, 20వ శతాబ్దం సగం వరకు (1958) వెనెజువెలాలో రాజకీయ అల్లర్లు, నియంతృత్వ ధోరిణి లాంటి సమస్యలతో సతమతం అయ్యింది. 1958 నుంచి ప్రజాస్వామ్య ప్రభుత్య పాలన కొనసాగడం, 1990ల్లో తీవ్రమైన ఆర్థిక సంక్షోభాలు, 1989లో కరకాజో తిరుగుబాటు, 1992లో రెండు పర్యాయాలు తిరుగుబాట్లు, 1993లో ప్రభుత్వ నిధుల దుర్వినియోగం చేశాడనే కారణంగా నాటి అధ్యక్షుడు "కార్లోస్ అంద్రస్ పెరెజ్" ప్రభుత్వం పతనం అయ్యింది.

వెనెజువెలా ఉత్థానపతనాలు:

1998లో కొత్త రాజ్యాంగంతో ఎన్నికలు నిర్వహించి "బొలివేరియన్ రిపబ్లిక్ ఆఫ్ వెనెజువెలా"గా అవతరించింది. "ఫెడరల్ ప్రెసిడెంషియల్ రిపబ్లిక్"గా కొనసాగుతున్న వెనెజువెలాలో 23 రాష్ట్రాలు ఉన్నాయి. 20వ శతాబ్దాంలో చమురు నిక్షేపాలు కనుగొన్న తర్వాత వెనెజువెలా సంపన్న దేశంగా అవతరించడం ప్రారంభమైంది. చమురు నిల్వలతో పాటు వ్యవసాయ ఉత్పత్తులు తోడయ్యాయి. 1970ల్లో ఆకస్మికంగా చమురు ధరలు నాలుగు రెట్లు పెరగడంతో వెనెజువెలా ఆర్థిక పరిస్థితి ఊహకు అందనంతగా పెరిగిపోయింది. దీనితో ప్రభుత్వంలో అవినీతి, దుర్వినియోగం పెరగడంతో పతనం ప్రారంభమైంది. 1980ల్లో చమురు ధరలు క్షీణించడం, ఆర్థిక సంక్షోభం, ఉత్పత్తి తగ్గడం, ఔషధాల కొరత, మౌళిక వనరుల కొరత, ద్రవ్యోల్బణ చిక్కులు, పేదరికం, కరువుకాటకాలు, ఆర్థిక అసమానతలు, వ్యాధుల వ్యాప్తి, శిశు మరణాలు, పోషకాహారలోపం, నేరాలు, అతిగా ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు లాంటి సమస్యలతో వెనెజువెలా నేడు అయోమయ దుస్థితిలో కొట్టుమిట్టాడుతున్నది. వీటికి తోడుగా అమెరికా ఆంక్షల బంధంలో చిక్కిన వెనెజువెలా మరింత దిగజారింది. 2021లో నికొలస్ మదురో అధ్యక్షుడిగా ఎన్నికై నియంతృత్వ ఏకపక్ష పాలన కొనసాగించడంతో వెనెజువెలా పరిస్థితి పెనెంలోంచి పొయ్యిలో పడినట్లు అయ్యింది.

"పెట్రోస్టేట్" లేదా "డచ్ వ్యాధి" దుస్థితిలోకి వెనెజువెలా:

ఒకప్పుడు ప్రపంచంలోనే అతి పెద్ద చమురు నిల్వలకు చిరునామాగా నిలిచిన వెనుజువెలా నేడు "పెట్రోస్టేట్"గా మారడం విచారకరం, స్వయం కృతాపరాదం. లాటిన్ అమెరికా ప్రాంతంలో అత్యంత సంపన్న దేశంగా ఉన్న వెనెజువెలా పేలవమైన పాలన, రాజకీయ వినాశనంతో ప్రమాదకర దుస్థితికి చేరింది. వెనెజువెలా ప్రభుత్వం పూర్తిగా చమురు ఎగుమతులపై ఆధారపడడం, కొందరి చేతుల్లోనే పాలన కేంద్రీకృతం కావడం, బలహీన రాజకీయ వ్యవస్థల్లో జవాబుదారీతనం కొరవడడం, అవినీతి ఆకాశాన్ని ముద్దాడడం లాంటి కారణాలతో ప్రెట్టోస్టేట్ ఊబిలోకి నెల్లబడింది. పెట్రోస్టేట్ వర్గ దేశాల జాబితాలో వెనుజువెలాతో పాటు కామెరూన్, ఇండోనేషియా, ఇరాన్, లిబియా, మెక్సికో, నైజీరియా, ఖతార్, రష్యా, సౌథీ అరేబియా, యూఏఈ లాంటి పలు దేశాలు చేరాయి. పెట్రోస్టేట్ దేశాలను ఆర్థికవేత్తలు "డచ్ వ్యాధి" దేశాలుగా అభివర్ణించబడ్డాయి. గత రెండు దశాబ్దాలుగా వెనెజువెలా నుంచి దాదాపు 7.9 మిలియన్ల ప్రజలు మరో మార్గం దొరక్క దేశం వదిలి ఇరుగుపొరుగు దేశాలకు వలసలు వెళ్లడం జరిగింది.

వెనెజువెలా చముర నిల్వలను కొల్లగొట్టాలనే దురుద్దేశంతో నేడు అమెరికా దురాక్రమణ నాటకానికి తెర తీసింది. ఇదే దండయాత్రను మెక్సికో, క్యూబా, కొలంబియా లాంటి దేశాల పైన కూడా జరుపుతామని అమెరికా హెచ్చరికలు చేస్తున్నది. ప్రపంచ శాంతికి అశనిపాతంగా మారుతున్న అమెరికన్ ట్రంప్ పెత్తందారీతనాన్ని ప్రపంచ దేశాలు ముక్క కంఠంతో వ్యతిరేకించి అగ్ర రాజ్య ఒంటెత్తు పోకడలకు ముక్కుతాడు వేసి, ప్రపంచ దేశాల్లో శాంతి పతాకాలను ఎగురవేయాలని కోరుకుందాం.

# 2026లోనూ పెట్టుబడుల ఫ్లో ఏపీ వైపే ఉండాలి

- మొదటి పేజీ తరువాయి

తీర్చిదిద్దాలి. పాపికొండలు-పోలవరం, కోనసీమ, పులికాట్, విశాఖ క్లస్టర్లను పర్యాటకంగా అభివృద్ధి చేయాలి. 2000 ఏళ్ల చరిత్ర ఉన్న తిమ్మమ్మ మర్రిమానుకు గూగుల్ మ్యాపింగ్ చేయించి ప్రపంచానికి పరిచయం చేయాలి. ఆవకాయ్, ఫ్లెమింగో, గండికోట వంటి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి" అని అధికారులకు సూచించారు.

**రైతులకు మేలు చేసే ఫుడ్ ప్రాసెసింగ్**

ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఏపీ ఛాంపియన్‌గా నిలవాలని సీఎం ఆకాంక్షించారు. "తిరుపతి ప్రాంతానికి మరిన్ని ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు రావాలి. రైతులు పండించిన ఉద్యాన పంటలకు విలువ జోడింపు (వాల్యూ అడిషన్) జరిగితేనే వారికి గరిష్ట ప్రయోజనం దక్కుతుంది. భవిష్యత్తులో పెరగనున్న ఉద్యాన ఉత్పత్తులకు అనుగుణంగా ప్రాసెసింగ్ యూనిట్లను ప్రోత్సహించాలి," అని వివరించారు. ఈ సందర్భంగా పాలసీల అమలులో ఎలాంటి మినహాయింపులు ఉండకూడదని, అందరికీ సమాన అవకాశాలు కల్పించాలని స్పష్టం చేశారు. అనంతరం సీఎం చంద్రబాబు 'ఏపీ ఐటీ ఇన్ఫ్రా కనెక్ట్' పోర్టల్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో మంత్రులు నారా లోకేశ్, పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు, నారాయణ, ఇతర మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# వెనెజువెలా సంక్షోభం... భారత్‌కు మేలు చేస్తుందంటున్న నిపుణులు!

అమెరికా, వెనెజువెలా మధ్య కొనసాగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు భారతదేశంపై తక్షణ ప్రభావం చూపబోవని, ప్రస్తుత పరిస్థితుల్లో భారత దేశ చమురు దిగుమతి వ్యయం పెరిగే అవకాశం లేదని మంగళవారం విడుదలైన ఒక నివేదిక స్పష్టం చేసింది. బ్యాంక్ ఆఫ్ బరోడా విడుదల చేసిన ఈ నివేదిక ప్రకారం, ప్రపంచ మార్కెట్‌లో ముడి చమురు సరఫరా అవసరానికి మించి (గ్లట్ మోడ్) ఉండటం, అంతర్జాతీయ ఉత్పత్తిలో వెనెజువెలా వాటా కేవలం 1 శాతం మాత్రమే కావడం ఇందుకు ప్రధాన కారణాలు. అందువల్ల, వెనెజువెలాలో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకున్నా, భారత్ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నివేదిక భరోసా ఇచ్చింది.వెనెజువెలాలో నిరూపితమైన చమురు నిల్వలు చాలా ఎక్కువని, ప్రపంచ మొత్తం నిల్వల్లో దాదాపు 19.4 శాతం అక్కడే ఉన్నాయని బ్యాంక్ ఆఫ్ బరోడా నివేదిక పేర్కొంది. ఈ భారీ నిల్వలను వెలికితీసి, సరఫరా పెంచేందుకు అమెరికా కంపెనీలు రంగంలోకి దిగవచ్చన్న మార్కెట్ అంచనాలతో ఇప్పటికే అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు కొంతమేర తగ్గుముఖం పట్టాయి. ఈ పరిణామం భారత్‌కు మేలు చేసే అంశమని విశ్లేషకులు భావిస్తున్నారు."ప్రస్తుత ప్రపంచ సరఫరా పరిస్థితులు, మిగులు నిల్వలను పరిగణనలోకి తీసుకుంటే, సమీప భవిష్యత్తులో భారత్ ఆయిల్ దిగుమతి బిల్లు పెరిగే ప్రమాదం కనిపించడం లేదు" అని నివేదికలో స్పష్టం చేశారు. ఒకవేళ అమెరికా కంపెనీలు వెనెజువెలాలో ఉత్పత్తిని పెంచితే, అంతర్జాతీయంగా ధరలు మరింత తగ్గి, భారత్ సహా అన్ని దేశాలకూ లబ్ధి చేకూరుతుందని మరో నివేదికలో విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.

**భారత్-వెనెజువెలా వాణిజ్య సంబంధాలు**

భారత్, వెనెజువెలా మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం ప్రస్తుతం 1.9 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇందులో భారత్ నుంచి ఎగుమతులు 217 మిలియన్ డాలర్లు కాగా, దిగుమతులు 1.6 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఈ దిగుమతుల్లో పెట్రోలియం, ఆయిల్, లూబ్రికెంట్స్ (పీఓఎల్) వాటానే అత్యధికం. "భారత్ దిగుమతి చేసుకుంటున్న దేశాలతో పోలిస్తే వెనెజువెలా నుంచి వస్తున్న ముడి చమురు యూనిట్ విలువ తక్కువగా ఉంది. ఇది మన దిగుమతి ఖర్చులను అదుపులో ఉంచడానికి సహాయపడుతుంది" అని బ్యాంక్ ఆఫ్ బరోడా ఆర్థికవేత్త దీపాన్విత మజుందార్ వివరించారు.

అయితే, గత ఐదేళ్లుగా వెనెజువెలాకు భారత ఎగుమతులు సగటున ఏటా 8.8 శాతం మేర క్షీణిస్తున్నాయి. ఇదే సమయంలో ప్రపంచానికి భారత్ చేస్తున్న మొత్తం ఎగుమతులు 6.9 శాతం వృద్ధి చెందాయి. దీన్నిబట్టి వెనెజువెలాతో వాణిజ్య సంబంధాలు మందగించాయని అర్థమవుతోంది. వెనెజువెలా నుంచి ముడి చమురును అధికంగా ఎగుమతి చేసుకుంటున్న దేశాల్లో అమెరికా మొదటి స్థానంలో ఉండగా, ఆ తర్వాత చైనా, భారత్ ఉన్నాయి. ఈ నేపథ్యంలో కొనసాగుతున్న చర్చల్లో చమురు దౌత్యం కీలక పాత్ర పోషిస్తోంది. కాగా, ఈ ప్రాంతంలోని భౌగోళిక రాజకీయ అనిశ్చితి కారణంగా వెనెజువెలాలో భారీ పెట్టుబడులు పెట్టడానికి కంపెనీలు వెనకడుగు వేయవచ్చని, ఇది చమురు ఉత్పత్తి పెంపునకు అడ్డంకిగా మారవచ్చని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

# వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఈ సమస్య

- మొదటి పేజీ తరువాయి

"సుబ్బరాయసాగర్ ప్రాజెక్టుకి ఎప్పుడో నీరు రావాల్సింది, కానీ వైసీపీ పాలకులు గేట్లకు కనీసం గ్రీజు పూసిన పాపాన పోలేదు. గేట్ల సమస్య వల్లే నీటి పంపిణీలో ఇంత ఆలస్యమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే డ్యాం గేట్ల మరమ్మతులకు నిధులు విడుదల చేసింది. ఉమ్మడి జిల్లాలోని డ్యాం గేట్ల మరమ్మతు బాధ్యతలను జలవనరుల నిపుణులు కన్నయ్యనాయుడు లాంటి వారికి అప్పగించాలి. టెండర్ల ద్వారా చేస్తే నిధులు దుర్వినియోగమయ్యే అవకాశం ఉంది" అని జేసీ చెప్పారు."ఎంపీఆర్ సౌత్ కెనాల్‌కు రూ.89 లక్షలు ఖర్చు చేసి మరమ్మతులు చేశాం. ఇప్పుడు ఎంపీఆర్ నుంచి సౌత్ కెనాల్‌కి సజావుగా నీరు వెళుతోంది. కాలువలో 280 క్యూసెక్కుల ప్రవాహం ఉంటేనే పుట్లూరు చెరువుకు నీరు చేరుతుంది. కానీ, ఎగువ ప్రాంత రైతులు అనవసరంగా గేట్లు ఎత్తి నీరు వాడుకుంటున్నారు. ఈ విషయంపై అధికారులతో మాట్లాడాం, మళ్లీ చర్చించి సమస్య పరిష్కరిస్తాం" అని తెలిపారు.

ధర్మవరం వైసీపీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డిపై కూడా జేసీ ఫైర్ అయ్యారు. హెచ్ఎల్సీ నీటిపై తుంపెర డీప్‌కట్ వద్ద జరిగిన ఘటన గురించి వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని చెప్పారు. తుంపెర డీప్‌కట్ వద్ద కాలువకు అడ్డం వేసింది ధర్మవరం ప్రాంత రైతులేనని, కలెక్టర్ అడ్డు తీయించారని తెలిపారు. నీరంతా చిత్రావతి నదిలోకి వెళ్లిపోయిందని చెప్పారు. నీ చిన్నాన్న, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఆయన కొడుకులు ఎక్కడికి వెళ్లారు? అని జేసీ ప్రశ్నించారు. "వచ్చి రాజకీయాలు చేయండి. మూడేళ్ల తర్వాత పార్టీ అధికారంలోకి వస్తే చూస్తాం, చేస్తాం అని చెప్పడం కాదు. అధికారం ఉన్నా, లేకపోయినా ఒకేలా ఉండాలి. వైసీపీ అధికారంలో ఉన్నపుడు మేం రాజకీయం చేశాం. మీలా మూడేళ్ల తర్వాత చేస్తాం అనలేదు. పదేళ్లుగా గన్‌మెన్ లేకుండా తిరుగుతున్నాం. మీరు గన్‌లు పెట్టుకుని తిరుగుతున్నారు" అని విమర్శించారు.

# భారీ భూకంపానికి చిగురుటాకులా వణికిన జపాన్?

- మొదటి పేజీ తరువాయి

ఉన్నాయని, ఇంత భారీ భూకంపం సంభవించినా ప్రాణనష్టం మాత్రం జరగలేదని వారు వివరించారు. భూకంపానికి సంబంధించి పలువురు నెటిజన్లు సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వీడియోలు భయానకంగా ఉన్నాయి. ఒక వీడియోలో మెట్రో రైల్వే స్టేషన్, చుట్టుపక్కల భవనాలు తీవ్రంగా కదలడం కనిపిస్తోంది.భూకంప కేంద్రం భూమి లోపల సుమారు 10 కిలోమీటర్ల లోతులో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. షిమనే ప్రిఫెక్చర్

రాజధాని మాట్సుతో పాటు టోటోరి ప్రిఫెక్చర్ పరిధిలోని పలు నగరాల్లో భూమి తీవ్రంగా కంపించింది. భారీ భూకంపం సంభవించిన నేపథ్యంలో ఆఫ్టర్ షాక్స్ వచ్చే ప్రమాదం ఉందని, అప్రమత్తంగా ఉండాలని ప్రజలను అధికారులు హెచ్చరించారు.

# మదురో లాగే ప్రధాని మోదీని ట్రంప్ కిడ్నాప్ చేస్తారా?

- మొదటి పేజీ తరువాయి

వ్యాఖ్యలపై నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.వెనెజువెలా అధ్యక్షుడిగా ఉన్న మదురోను అమెరికా అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఈ అంశంపై పృథ్వీరాజ్ చవాన్ మాట్లాడుతూ, వెనెజువెలా సంక్షోభంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మౌనంగా ఉన్నారని ఆరోపించారు. అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించి ఎన్నికైన అధ్యక్షుడిని తొలగించినప్పటికీ భారత్ మౌనంగా ఉందని అన్నారు. అమెరికా చర్యలు ప్రపంచానికి చెడు సంకేతాన్ని అందిస్తాయని అన్నారు.

వెనెజువెలాలో ఎన్నికైన అధ్యక్షుడిని కిడ్నాప్ చేశారని, రేపు మరే దేశాధినేతకైనా ఇలా జరగవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది భారతదేశానికి కూడా జరగవచ్చని సంచలన వ్యాఖ్యలు చేశారు.

ప్రపంచంలోని వివిధ సంఘర్షణలపై భారత ప్రభుత్వం స్పష్టమైన వైఖరిని తీసుకోవడంలో విఫలమైందని చవాన్ ఆరోపించారు. రష్యా, చైనాలు ఏదో ఒక వైఖరిని తీసుకున్నాయని వెల్లడించారు. రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయెల్-హమాస్ యుద్ధాల విషయంలోనూ భారత్ స్పష్టమైన వైఖరిని చెప్పలేకపోయిందని ఆరోపించారు. మనం అమెరికాకు భయపడుతున్నట్లుగా ఉందని అన్నారు.

మదురో అమెరికాలో డ్రగ్స్ సరఫరా చేస్తున్నారంటూ నిరాధార ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. వెనెజువెలా ఆయిల్ నిల్వలే కిడ్నాప్‌కు ప్రధాన కారణమని అనుమానం వ్యక్తం చేశారు. మనం మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్నా, భద్రతా మండలిలో శాశ్వత సభ్యులు కావాలన్నా ప్రపంచ అంశాలపై స్పష్టమైన వైఖరిని తీసుకోవాలని అన్నారు.భారతదేశ ఉత్పత్తులపై అమెరికా అధిక వాణిజ్య పన్నులు విధించడాన్ని పృథ్వీరాజ్ చవాన్ తప్పుబట్టారు. మన ఎగుమతులపై ప్రత్యక్ష నిషేధం విధించలేక, వాణిజ్యాన్ని ఆపేందుకు సుంకాలను ట్రంప్ ఒక సాధనంగా ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. అమెరికాకు ఎగుమతులు చేయడం ద్వారా గతంలో ఆర్జించిన లాభాలు ఇప్పుడు రావని, మనం ప్రత్యామ్నాయ మార్కెట్లను అన్వేషించాలని అన్నారు.

పృథ్వీచవాన్ వ్యాఖ్యలు దారుణం

పృథ్వీరాజ్ చవాన్ చేసిన వ్యాఖ్యలపై జమ్ము కశ్మీర్ మాజీ పోలీసు అధికారి ఎస్పీ వైద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకుడి వ్యాఖ్యలు దేశాన్ని అవమానించేలా ఉన్నాయని మండిపడ్డారు. పృథ్వీరాజ్ చవాన్ బ్రెయిన్ డెడ్ అయిందని, నిరక్షరాస్యుడని, మూర్ఖుడంటూ సామాజిక మాధ్యమాల్లో నెటిజన్లు విమర్శలు గుప్పిస్తున్నారు.మదురోకు ట్రంప్ చేతిలో ఎదురైన అనుభవమే మన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కూడా జరగాలని కాంగ్రెస్ నేత చవాన్ కోరుకోవడం దేశాన్ని అవమానించడమేనని వైద్ అన్నారు. పృథ్వీరాజ్ చవాన్ కనీసం మాట్లాడే ముందు ఆలోచన చేయాల్సిందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అసలు భావజాలం ఇదేనా, ఇప్పుడు వారి రంగు బయటపడుతోందని అన్నారు.

## కాశీ ఎక్స్‌ప్రెస్ కు బాంబు బెదిరింపు

కాశీ ఎక్స్‌ప్రెస్ రైలుకు బాంబు బెదిరింపు కాల్ రావడంతో కలకలం రేగింది. గోరఖ్‌పూర్ నుంచి ముంబైకి వెళుతున్న కాశీ ఎక్స్‌ప్రెస్‌లో బాంబు పెట్టినట్లు గుర్తు తెలియని వ్యక్తి పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసి బెదిరించాడు. దీంతో అప్రమత్తమైన అధికారులు రైలును 'మౌ' రైల్వే స్టేషన్‌లో నిలిపి తనిఖీలు చేపట్టారు. అయితే, ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభ్యం కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఈ ఘటనపై 'మౌ' రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎలమరన్ మాట్లాడుతూ, కాశీ ఎక్స్‌ప్రెస్ రైలుకు బాంబు బెదిరింపు వచ్చిందని తెలిపారు. రైలు స్టేషన్‌కు చేరుకున్న వెంటనే ప్రయాణికులందరినీ కిందకు దించి, ప్రతి బోగీలో క్షుణ్ణంగా తనిఖీలు చేశామని చెప్పారు. పేలుడు పదార్థాలు ఉన్నట్లు ఎలాంటి ఆధారాలు లభించలేదని ఆయన స్పష్టం చేశారు. ఈ బెదిరింపు కాల్ ఎక్కడి నుంచి వచ్చిందో విచారణ జరుపుతున్నట్లు ఆయన వెల్లడించారు. ఉదయం ఫోన్ కాల్ రాగానే 'మౌ' పోలీసులు, జీఆర్పీ, ఆర్పీఎఫ్‌తో కలిసి రైల్వే స్టేషన్‌కు చేరుకుని తనిఖీలు నిర్వహించారని ఆయన పేర్కొన్నారు.

# ఏపీలో 14 కొత్త ప్రాజెక్టులు ఇవే... గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన ఎస్ఐపీబీ

- మొదటి పేజీ తరువాయి

వెబ్ సోల్ రెన్యూవబుల్-నాయుడుపేట-రూ. 3538 కోట్లు-1980 ఉద్యోగాలుటాటా పవర్-నెల్లూరు జిల్లా-రూ. 6675 కోట్లు-1000 ఉద్యోగాలురామ్ కో సిమెంట్స్- నంద్యాల జిల్లా-రూ. 1500 కోట్లు-300 ఉద్యోగాలుషిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ -కడప జిల్లా-రూ. 5571 కోట్లు-5000 ఉద్యోగాలుఎథిరియల్ ఎక్స్ ప్లోరేషన్ గిల్డ్-తిరుపతి జిల్లా-రూ. 578 కోట్లు-382 ఉద్యోగాలుపయనీర్ క్లీన్ యాంప్స్-చిత్తూరు జిల్లా-రూ. 159 కోట్లు-600 ఉద్యోగాలురాధికా వెజిటబుల్స్ ఆయిల్స్ -విజయనగరం జిల్లా-రూ. 234 కోట్లు-165 ఉద్యోగాలు

రిలయెన్స్ కన్స్యూమర్స్-అనకాపల్లి జిల్లా- రూ. 30 కోట్లు.

# కోనసీమలో ఓఎన్జీసీ గ్యాస్ బ్లోఅవుట్... ఇంకా అదుపులోకి రాని మంటలు

- మొదటి పేజీ తరువాయి

రిపేర్ పనులు చేస్తుండగా అధిక పీడనంతో గ్యాస్, ముడి చమురు బయటకు చిమ్మి ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. ఈ ఘటనతో సమీప గ్రామాల్లో భయాందోళన వాతావరణం నెలకొంది.ఓఎన్జీసీ సాంకేతిక నిపుణులు, అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. అంతర్జాతీయ నిపుణుల సహాయం కూడా తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రమాద స్థలాన్ని పూర్తిగా ఆధీనంలోకి తీసుకుని, బావిని చల్లబరిచే పనులు కొనసాగిస్తున్నారు. ప్రస్తుతానికి నీరు, మట్టితో మంటలు ఆర్పే ప్రయత్నం చేస్తున్నారు. అధికారులు రెండు లారీల్లో కూలెంట్ ను తీసుకువస్తున్నారు. దీని సాయంతో మంటలు ఆర్పడంలో పురోగతి కనిపిస్తుందని భావిస్తున్నారు.కోనసీమ జిల్లా కలెక్టర్ మహేశ్ కుమార్, ఎస్పీ రాహుల్ మీనా ఘటనా స్థలంలోనే ఉండి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. ముందుజాగ్రత్త చర్యగా ఇరుసుమండ, మోరి గ్రామాలకు చెందిన సుమారు 500 కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించారు. వారికి భోజనం, వైద్య సదుపాయాలు కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు.ఘటనా స్థలాన్ని పరిశీలించిన అమలాపురం ఎంపీ గంటి హరీశ్ బాలయోగి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారని చెప్పారు. బాధితులకు అన్ని విధాలా అండగా ఉంటామన్నారు.

# భోగాపురం ఎయిర్‌పోర్ట్ ఘనత మాదే: వైసీపీకి పీవీఎన్ మాధవ్ కౌంటర్

- మొదటి పేజీ తరువాయి

వైసీపీ నేతలకు అలవాటుగా మారిందని విమర్శించారు. భోగాపురం ఎయిర్‌పోర్టు వల్ల ఉత్తరాంధ్రకు ఎంతో మేలు జరుగుతుందని, ఈ విషయాన్ని వైసీపీ నేతలు కూడా స్వాగతించాలని ఆయన కోరారు.ఇదే సందర్భంగా రాష్ట్రంలోని నీటి ప్రాజెక్టుల గురించి కూడా మాధవ్ మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల మధ్య నీటి సమస్యల పరిష్కారానికి ట్రైబ్యునల్స్ ఉన్నాయని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యూహాత్మకంగా కొన్ని కొత్త ప్రాజెక్టులను ప్రకటించిందని, పాత ప్రాజెక్టులను పూర్తిచేయడంపై దృష్టి పెట్టిందని తెలిపారు. హంద్రీనీవా కాలువ పనులు పూర్తి చేసి కుప్పం వరకు నీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. త్వరలోనే పురుషోత్తపట్నం పనులు పూర్తిస్థాయిలో మొదలవుతాయని, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులను వేగవంతం చేస్తామని చెప్పారు. ఈ ప్రాజెక్టులన్నీ పూర్తయితే ఏపీ సమగ్రాభివృద్ధి శరవేగంగా జరుగుతుందని మాధవ్ విశ్వాసం వ్యక్తం చేశారు.

# కేంద్ర బడ్జెట్ 2026 తేదీపై సందిగ్ధత.. ఫిబ్రవరి 1న ప్రవేశపెడతారా?

- మొదటి పేజీ తరువాయి

అంతకుముందు దివంగత ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ 2015 ఫిబ్రవరి 28 (శనివారం), 2016 ఫిబ్రవరి 28 (ఆదివారం) తేదీల్లో బడ్జెట్‌ను సమర్పించారు. పార్లమెంటరీ సంప్రదాయాలను అనుసరిస్తే, ఆదివారం నాడు కూడా బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. దీనిపై పార్లమెంటరీ వ్యవహారాల కేబినెట్ కమిటీ సరైన సమయంలో తుది నిర్ణయం తీసుకుంటుందని మంత్రి కిరణ్ రిజిజు స్పష్టం చేశారు.

**ఫిబ్రవరి 1 తేదీ ఎందుకంత ముఖ్యం?**

2017కు ముందు కేంద్ర బడ్జెట్‌ను ఫిబ్రవరి చివరి పనిదినాన ప్రవేశపెట్టేవారు. దీనివల్ల బడ్జెట్ ఆమోద ప్రక్రియ ఆలస్యమయ్యేది. కొత్త ఆర్థిక సంవత్సరం (ఏప్రిల్ 1) ప్రారంభమైన తర్వాత కూడా కొన్ని నెలల పాటు బడ్జెట్ ఆమోదం పొందకపోయేది. ఈ సమయంలో ప్రభుత్వ ఖర్చుల కోసం పార్లమెంట్ 'ఓట్ ఆన్ అకౌంట్' ను ఆమోదించాల్సి వచ్చేది. ఈ జాప్యాన్ని నివారించడానికి 2017లో అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్ తేదీని ఫిబ్రవరి 1కి మార్చారు. దీనివల్ల మార్చి 31లోపే బడ్జెట్ ఆమోద ప్రక్రియ పూర్తి చేయడానికి పార్లమెంటుకు తగినంత సమయం లభిస్తుంది.గతంలో ఆదివారాల్లో పార్లమెంట్ సమావేశమైన సందర్భాలు కూడా ఉన్నాయి. కోవిడ్-19 సమయంలో, అలాగే పార్లమెంట్ తొలి సమావేశం 60వ వార్షికోత్సవం సందర్భంగా 2012లో ఆదివారం నాడు సభ జరిగింది. ఈ నేపథ్యంలో 2026 బడ్జెట్ తేదీపై ప్రభుత్వం సంప్రదాయం, సౌలభ్యం మధ్య సమన్వయం సాధిస్తూ త్వరలోనే తుది నిర్ణయం ప్రకటించే అవకాశం ఉంది.

పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా । తిరుపతి జిల్లా । చిత్తూరు జిల్లా । వై.ఎస్.ఆర్. కడప జిల్లా ।

## నెల్లూరు జిల్లాలో పెను సంచలనం సృష్టించిన దారుణ హత్య





కోవూరు పెన్ పవర్ జనవరి 6.కొడవలూరు మండలం కొత్త వంగల్లు గ్రామంలో పేట కోటేశ్వరమ్మ ఒంటరి మహిళ అత్యంత దారుణంగా హత్యకు గురైంది ఈ ఘటన స్థానికంగా భయాందోళనలకు గురిచేస్తోంది నెల్లూరు జిల్లా పోలీసు యంత్రాంగం ఈ కేసును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిందితులు కోసం గాలింపు

## గంగవరం పంచాయతీ టీడీపీ కార్యదర్శిగా గెవిమఠం లోకేష్



పలమనేరు,పెన్ పవర్,జనవరి 06,
గంగవరం పంచాయతీ తెలుగుదేశంపార్టీ ప్రధాన కార్యదర్శిగా గెవిమఠం లోకేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం టీడీపీ పంచాయతీ సర్వసభ్య సమావేశం పలమనేరు పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయం నందు అధ్యక్షులు ఆనంద నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈసందర్భంగా గతంలో ఇదేపార్టీ కార్యదర్శిగా పనిచేసి, పలువురు మన్ననలు పొందిన బాలాజీని మండల స్థాయి యూనిట్ ఇంచార్జిగా నియమించి ఆయనకు సముచిత స్థానం కల్పించింది.ఈ నేపథ్యంలో కార్యదర్శిగా పంచాయతీలోని కూర్నిపల్లె గ్రామానికి చెందిన గెవిమఠం లోకేష్ ను కార్యకర్తలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని అధ్యక్షులు ఆనంద్ నాయుడు తెలిపారు. ఓటు హక్కు ఏర్పడినప్పటి నుండీ తెలుగుదేశం పార్టీలో ఉంటూ,పలు ఎన్నికల్లో చురుగ్గా ఉన్న నన్ను పార్టీ గుర్తించి పార్టీ కార్యదర్శిగా అవకాశం కల్పించిన పంచాయతీ, మండల స్థాయి నాయకులకు కృతజ్ఞతలు తెలుపు తున్నానని,అలాగే పార్టీ ఆదేశాలను పాటిస్తూ,తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తానని లోకేష్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయనను పలువురు నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

## రాయలసీమ బద్ధవిరోధి జగన్ రెడ్డే!

### -డా.యం.ఉమేష్ రావు,రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి



శ్రీకాళహస్తి , పెన్ పవర్ , జనవరి ,06 :
తను పుట్టి పెరిగిన, తన కుటుంబానికి రాజకీయంగా వెన్నుదన్నుగా నిలిచిన రాయలసీమ ప్రాంతానికి వీలైనంత వరకు ద్రోహానికి పాల్పడే సీమ బద్ధ విరోధి జగన్ రెడ్డి అని తెలుగుదేశం పార్టీ, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు ఆరోపించారు.
రాయలసీమలో 102 ప్రాజెక్టుల పనులను ప్రీ క్లోజర్ చేసిన జగన్.. తీరని ద్రోహం చేశాడని,రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి జగన్ తన ఐదేళ్ల పాలనలో కనీసం ప్రయత్నించలేదని ఆరోపించారు.జగన్ అధికారంలోకి రాగానే రాష్ట్ర వ్యాప్తంగా 198 సాగునీటి ప్రాజెక్టు పనులను ఏకపక్షంగా రద్దు చేశారని, వాటిలో సీమ ప్రాంతానికి చెందినవి 102 ఉన్నాయి. అలాగే అవగాహన, ఆలోచన లేకుండా అహంకారంతో సాగునీటి రంగాన్ని నాశనం చేసారు.రాయలసీమ పాలిట శనిలా దాపురించాడు జగన్.ఈ ప్రాంత నీటి అవసరాలను తీర్చే గుండెకాయ లాంటి హంద్రీనీవా ప్రాజెక్టుపై జగన్ ఐదేళ్ల పాలనలో ఖర్చు చేసింది సున్నా అని ఆరోపించారు.రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టులను శ్రీకారం చుట్టి పూర్తి చేసిన ఘనత తెలుగుదేశం పార్టీదే.
రాయలసీమలో ఏ ప్రాజెక్ట్ పేరు చెప్పినా గుర్తుకు వచ్చేది ఎన్టీఆర్,చంద్రబాబు అని కొనియాడారు.సీఎం చంద్రబాబు 100 రోజుల్లో 738 కిలోమీటర్ల మేర హంద్రీనీవా కాలువలు వెడల్పు చేసి కుప్పం వరకూ నీరిచ్చారు.ఎన్డీయే కూటమి ప్రభుత్వం 18 నెలల పాలనలో ఈ ప్రాజెక్టు కోసం రూ. 3,890 కోట్లు ఖర్చు చేసిందని పేర్కొన్నారు.శ్రీశైలం నుండి వరద జలాలను మళ్లించి సీమ జిల్లాల్లోని 6.025 లక్షల ఎకరాలకు సాగునీరు, 10 లక్షల మందికి తాగు నీరు ఇవ్వడం హంద్రీ - నీవా సుజల స్రవంతి ప్రాజెక్టు లక్ష్యం.గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే హంద్రీ-నీవా పనులు 47% పూర్తయ్యాయి.జగన్ హయాంలో గంపెడు మట్టి కూడా పోయలేదు.కూటమి ప్రభుత్వం వచ్చాక ఏడాదిలోనే రూ.2,226 కోట్లతో కాలువల్లో లైనింగ్ పనులు పూర్తిచేసి కుప్పానికి కృష్ణా జలాలను తీసుకెళ్ళారని తెలిపారు.



## శ్రీకాళహస్తిలో ఘనంగా శ్రీ త్యాగరాజ స్వామి వారి ఆరాధన మహోత్సవాలు

శ్రీకాళహస్తి ,పెన్ పవర్ ,జనవరి ,06 :శ్రీకాళహస్తిలోని పొన్నాలమ్మ గుడి ఆవరణలో మంగళవారం సద్గురు శ్రీ త్యాగరాజ స్వామి వారి 6వ ఆరాధన మహోత్సవాలు ఘనంగా జరిగాయి.అధ్యక్షుడు మహేంద్ర అధ్యక్షత న జరిగిన ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయి బ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా త్యాగరాజ స్వామి వారి చిత్రపటానికి పూజలు చేసిన అనంతరం సంగీత కచేరి నిర్వహించారు. ఈ సందర్భంగా నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం మాట్లాడుతూ శ్రీ శ్రీ సద్గురు త్యాగరాజ స్వామి వారి యొక్క కీర్తనలు గొప్పతనాన్ని గురించి తెలియజేయడం జరిగింది అంతేకాకుండా నాయి బ్రాహ్మణులకు కూటమి ప్రభుత్వం అండగా ఉందని చెప్పారు. ఇందులో భాగంగా నాయి బ్రాహ్మణులకు దేవాలయాల పాలక మండలిలో సభ్యులుగా నియమించడం, దేవాలయాలలో పనిచేస్తున్న నాయి బ్రాహ్మణులకు 20 వేలు నుంచి 25 వేలకు గౌరవ వేతనం పెంచడం, సెలూన్ షాపులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇవ్వడం జరిగిందని వివరించారు. త్యాగరాజ స్వామి వారి ఉత్సవాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న నిర్వాహకులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మహేంద్ర, వెంకట ముని, బాలసుబ్రమణ్యం, మునిశేఖర్. హేమాద్రి,సురేష్, కే మురళి, ఏ రాజేష్, ఎస్ కుమార్, యు ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై నేషనల్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులకు అవగాహన



పలమనేరు,పెన్ పవర్, జనవరి 06,
రోడ్డు భద్రతపై గంగవరం మండల కేంద్రంలోని నేషనల్ పబ్లిక్ స్కూల్ నందు విద్యార్థులకు మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ మధుసూధన్ అవగాహన కల్పించారు. మంగళవారం రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించి ఆయన మాట్లాడుతూ..రోడ్డు భద్రతా నియమాలు,సేఫ్ డ్రైవింగ్ పై విద్యార్థులు తెలుసు కోవాలన్నారు.అలాగే విద్యార్థులకువకృత్వ,వ్యాస రచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి,ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆయన చేతులమీద బహుమతులు అందజేసారు.కార్యక్రమంలో నేషనల్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ ప్రమోద్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## భారతీయ జనతా పార్టీ ఓ.బి.సి మోర్చా జిల్లా కార్యదర్శిగా మహిమలూరు. ప్రవీణ్ కుమార్



బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ జనవరి 6. బుచ్చిరెడ్డిపాళెం కు చెందిన మహిమలూరు. ప్రవీణ్ కుమార్ ను నియమిస్తూ భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మామిడి. వెంకటేశ్వర్లు నియామక పత్రం అందజేయడం పట్ల బుచ్చిరెడ్డిపాళెం లో పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కష్టపడే ప్రతి వ్యక్తినీ పార్టీ గుర్తించి సముచిత స్థానం కల్పిస్తుందని,చిన్నతనం నుండి బిజెవైయం లో అనేక ఉద్యమాలలో పాల్గొని తన దైన శైలిలో అనేక ప్రజా సమస్యలపై పోరాడాడని,అనేక మందిని పార్టీకి పరిచయం చేసాడని నేడు వారికి జిల్లా భాద్యతలు రావడం చాలా సంతోషదాయకమని కచ్చితంగా బి.సి ల సమస్యలపై పోరాడి వారి అబ్బ్యున్నతి కోసం కృషి చేస్తూ ఇచ్చిన భాద్యతకు న్యాయంచేయగల సమర్ధుడు ప్రవీణ్ కుమార్ అని, ఆయన నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి మహిమలూరు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ చిన్న తనం నుండి జాతీయ భావాలు గల అతి సామాన్య కుటుంబం నుండి వచ్చిన నన్ను పార్టీ గుర్తించి బీజేవైఎం లో మండల అధ్యక్షుడిగా,అసెంబ్లీ కన్వినర్ గా, కార్యదర్శిగా, జిల్లా ఉపాధ్యక్షుడుగా,కిసాన్ మోర్చాలో జిల్లా ప్రధాన కార్యదర్శి గా పనిచేసే అవకాశం ఇచ్చిందని,ఇప్పుడు ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శిగా భాద్యతలు అప్పగించిన భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు శీపారెడ్డి.వంశీధర్ రెడ్డి ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మామిడి. వెంకటేశ్వర్లు ధన్యవాదాలు తెలిపారు.

## శ్రీకాళహస్తి సహకార పాల సరఫరా సొసైటీ సంఘం మహాజనసభ కార్యక్రమంలో : ఎమ్మెల్యే బొజ్జల



శ్రీకాళహస్తి , పెన్ పవర్ ,జనవరి, 06 :
లది శ్రీకాళహస్తి సహకార పాల సరఫరా సొసైటీ సంగం లిమిటెడ్ మహాజన సభ సమావేశం కార్యక్రమం లో శ్రీకాళహస్తి శాసన సభ్యులు బొజ్జల వెంకట సుదీర్ రెడ్డి , బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ , శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, తిరుపతి జిల్లా పార్లమెంట్ ఉపాధ్యక్షులు రంగినేని చెంచయ్య నాయుడు , పాల సొసైటీ చైర్మన్ మునగాల మధుసూడన్ , బట్టీరెడ్డి , కామేష్ యాదవ్ పాల్గొన్నారు.

## పెళ్లకూరు నూతన ఎస్సైగా బాధ్యతల చేపట్టిన దారం. ఆదిలక్ష్మ

పెళ్లకూరు,పెన్ పవర్, జనవరి 6: పెళ్లకూరు మండల పోలీస్ స్టేషన్ నూతన సబ్ ఇన్స్పెక్టర్ దారం. ఆదిలక్ష్మ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో_. నాగరాజుఎస్సైగా విధులు నిర్వహించిన చిట్టమూరు బదిలీ కావడంతో, ఆయన స్థానంలో నాయుడుపేట ఎస్సైగా పనిచేస్తున్న దారం. ఆదిలక్ష్మ ఉన్నతాధికారులు ఇక్కడికి బదిలీ చేశారు.



ఈ సందర్భంగా నూతన ఎస్సై దారం. ఆదిలక్ష్మమాట్లాడుతూ మండల ప్రజలకు కీలక సందేశం ఇచ్చారు.

**శాంతిభద్రతల పరిరక్షణ:**మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తామని, ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా నిరంతరం నిఘా ఉంచుతామని ఎస్సై పేర్కొన్నారు.

**ప్రజలకు అందుబాటులో:** ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఎప్పుడైనా ధైర్యంగా పోలీస్ స్టేషన్‌కు రావచ్చని, బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

**సమన్వయం:** మండల ప్రజలు, ప్రజాప్రతినిధులు పోలీసులకు సహకరించి మండల అభివృద్ధికి, ప్రశాంతతకు తోడ్పడాలని ఆమె కోరారు.

## రైతుల అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తాం

### -ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్



నాయుడుపేట, పెన్ పవర్, జనవరి 6నాయుడుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధి లోని రైతులు అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తామని ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ అన్నారు. మంగళవారం స్థానిక ఏఎంసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు.గ్రామీణ ప్రాంతాల్లో లింకు రోడ్ల నిర్మాణాలకు అవసరమైన నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.ఈ ఆర్థిక సంవత్సరంలో ఏఎంసి ఆదాయ లక్ష్యాన్ని చేరుకునేందుకు కమిటీ సభ్యులు, ఏఎంసీ అధికారులు సిబ్బంది సహకరించాలని కోరారు. అనంతరం ఏఎంసీ కమిటీ సభ్యులకు గౌరవ వేతనం చెక్కులను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ కిలారి గోపాలకృష్ణ,పలువురు కమిటీ సభ్యులు,ఏఎంసి అధికారులు పాల్గొన్నారు.

## విశాఖఒడిశా నుంచి గంజాయి రవాణా, నెల్లూరు పరిసర ప్రాంతాల్లో విక్రయాలు కోవూరులో ఆరుగురు అరెస్ట్.

కోవూరు పెన్ పవర్ జనవరి 6.నెల్లూరు పరిసర ప్రాంతాల్లో గంజాయి అక్రమ రవాణా, విక్రయాల్లో పాలుపంచుకుంటున్న ఆరుగురు వ్యక్తులను సీఐ సుధాకర్ రెడ్డి మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ చేసిన నిందితులను పట్టణంలోని ప్రధాన రహదారిపై పోలీసులు నడిపించారు.ఈ సందర్భంగా సీఐ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం గంజాయి సహా ఇతర మత్తు పదార్థాల నిర్మూలనకు తీసుకున్న నిర్ణయాన్ని కట్టుదిట్టంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఎస్పీ అజిత వేజెండ్ల, రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసులు ఆదేశాల మేరకు తమకు అందిన సమాచారంతో కొంతకాలంగా నిందితులపై నిఘా పెట్టి, చివరకు వారిని అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు.నిందితుల వద్ద నుంచి సుమారు రూ.3.5 లక్షల విలువైన ఆరున్నర కేజీల గంజాయి మరియు రెండు మోటార్ బైకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విశాఖపట్నం మరియు ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి గంజాయిని తరలించి నెల్లూరు పరిసర ప్రాంతాల్లో వ్యాపారం చేస్తున్నట్లు తెలిపారు.నిందితులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాలకు సంబంధించిన అసాంఘిక కార్యకలాపాలపై ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని పోలీసులు హామీ ఇచ్చారు.



# ప్రభుత్వవైద్యంపై అసత్య ప్రచారం తగదు

## ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్




తాడేపల్లిగూడెం, పెన్ పవర్/జనవరి 06 పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో:

ప్రభుత్వ వైద్య, ఆరోగ్య వ్యవస్థపై వైసిపి అసత్య ప్రచారం చేయటం తగదని శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్ ప్రభుత్వ అసమర్ధత వల్ల గాడి తప్పిన వైద్య రంగాన్ని కూటమి ప్రభుత్వం సరిచేసి ప్రజలకు పూర్తి స్థాయి వైద్య సేవలు అందించే విధంగా అభివృద్ధి చేసిందన్నారు. వివిధ అనారోగ్యాలతో ఇబ్బంది పడుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఐదు కోట్ల రూపాయల పైనే సహాయం అందించామ న్నారు. అంబులెన్సులపై దుష్ప్రచారం చేయడం దారుణమన్నారు. అంబులెన్స్ లు పూర్తిస్థాయిలో నిర్వహిస్తున్నామని జిపిఎస్ ద్వారా పర్యవేక్షణ జరుగుతుందని ఎలాంటి ఇబ్బంది లేకుండా వైద్య సేవలు అందుతున్నాయని అన్నారు. అంబులెన్స్ చార్జీలను కూడా ప్రభుత్వం నిర్ణయించి అమలు చేస్తుందన్నారు. ఎలాంటి దోపిడీ జరగకుండా తగిన చర్యలు చేపట్టామన్నారు. ప్రజారోగ్యం విషయంలో పూర్తి చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో తుప్పు పట్టిన అంబులెన్స్ వ్యాన్ లను ఫోటోలు తీసి, అవి ఇప్పుడు ఉన్నట్టుగా సొంత మీడియాలో ప్రభుత్వం పై విష ప్రచారం చేయటం ప్రజలు గమనించాలని అన్నారు. వైసిపి హయాంలో ప్రజారోగ్యం పేరు చెప్పి దోపిడీ చేశారని విమర్శించారు. పిపిపి విధానం అనేది వాజ్ పేయి ప్రధానమంత్రిగా ఉన్న సమయంలోనే ప్రవేశపెట్టారని, జాతీయ రహదారులు నిర్మించారని గుర్తు చేశారు. ప్రభుత్వం వద్ద అవసరమైన నిధులు లేనప్పుడు పిపిపి విధానం ద్వారా అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఎలా నిర్మించినా వైద్య కళాశాలలు ప్రభుత్వ అధీనంలోనే ఉంటాయని తెలిపారు. దాని మీద కూడా విష ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేసి రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా చేసి అభివృద్ధికి ఆటంకం కలిగించడమే వైసిపి దురుద్దేశమని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల సహకారంతో తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో భారీ ఎత్తున రోడ్లు అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. గతంలో ఉపముఖ్యమంత్రిగా ఉండి రోడ్లు గుంతలు కూడా పుడ్చలేని అసమర్ధుడు మేము అభివృద్ధి చేస్తుంటే తప్పుడు విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్యే విమర్శించారు. ఇలాంటి తప్పుడు ప్రచారం మాని సద్విమర్శలు చేయాలని కోరారు. అనంతరం ఆసుపత్రుల్లోని అత్యవసర విభాగం తదితర విభాగాలను, అంబులెన్సు లను ఎమ్మెల్యే పరిశీలించారు. ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతున్న రోగులను సేవల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు . ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ పాల్, తాడేపల్లిగూడెం నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ ఈటకోట తాతాజీ, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బడుగు వెంకటేశ్వరరావు, వర్తనపల్లి కాశి, పుల్ల బాబి,పాలూరి వెంకటేశ్వరరావు, మద్దాల మణికుమార్, రామ్ లక్ష్మణ్, పేతిన గిరి, వాడపల్లి వాడపల్లి సుబ్బరాజు,కూటమి నాయకులు, ప్రభుత్వాసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



## తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారిని దర్శించుకున్న మారిషస్ అధ్యక్షుడు శ్రీ ధరమ్ బీర్ గోగుల్.



తిరుపతి/పెన్ పవర్/జనవరి 06 మారిషస్ గౌరవ అధ్యక్షుడు శ్రీ ధరమ్ బీర్ గోగుల్ మంగళవారం సాయంత్రం తిరుచానూరులోని శ్రీ పద్మావతీ అమ్మవారిని దర్శించుకున్నారు. శ్రీ పద్మావతీ అమ్మవారి ఆలయానికి చేరుకున్న మారిషస్ అధ్యక్షుడికి టిటిడి జేఈవో శ్రీ వి. వీరబ్రహ్మం సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి దర్శనం పూర్తయ్యాక శ్రీ ధరమ్ బీర్ గోగుల్ గారికి టిటిడి జేఈవో తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శ్రీ ఎల్ సుబ్బరాయుడు, సివిఎస్వో శ్రీ్. వి. మురళీకృష్ణ, పలువురు టిటిడి అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

## రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ



కొడవలూరు పెన్ పవర్ జనవరి 6. కొడవలూరు మండలంలోని ఎంపిడిఓ కార్యాలయంలో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజముద్ర కలిగిన పట్టాదారు పాసుపుస్తకాలను రైతులకు పంపిణీ చేయడం జరిగింది. మండల టిడిపి నాయకులు మాట్లాడుతూ, రైతుల భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడంతో పాటు భూ హక్కుల భద్రత కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పట్టాదారు పాసుపుస్తకాల ద్వారా రైతులు ప్రభుత్వ పథకాలు, రుణ సదుపాయాలు సులభంగా పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు, రైతులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. రైతులు తమకు పాసుపుస్తకాలు అందినందుకు సంతోషం వ్యక్తం చేస్తూ కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ స్ఫూర్తి రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు నాప వెంకటేశ్వర్లు నాయుడు, కొడవలూరు మండల టీడీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గోవా గవర్నర్ తో ముఖ్యమంత్రి భేటి



పెన్ పవర్/జనవరి 06 విశాఖ బ్యూరో::గోవా గవర్నర్ అశోక్ గజపతి రాజు తొ ఎం.పి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బేటి అయ్యారు,వివిద కార్యక్రమాలలొ పాల్గొనేందుకు రాష్టానికి వచ్చిన అశోక్ గజపతిరాజు ను తన అధికారిక నివాసానికి మర్యాదపూర్వకంగా ఆహ్వానించి వివిధ అంశాలపై చర్చించారు, భోగాపురం లొ నిర్మించే జిఎంఆర్ -మాన్సాస్ ఏవియేషన్ ఎడ్యూ సిటీకి భూమి ని ఇచ్చినందుకు ముఖ్యమంత్రి అశోక్ గజపతి రాజు కు కృతజ్ఞతలు తెలిపారు, ఉత్తరాంధ్ర రీజియన్ అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి పెట్టామని, ఇందుకు సంబంధించి ప్రణాళికలను రూపొందించినట్లు సిఎం వివరించారు.



## మోసపోయిన మహిళకు పోలీసులు సహాయం

పెన్ పవర్/జనవరి 06 విశాఖ బ్యూరో:: ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తున్న ఓ మహిళ ఎఆర్ కానిస్టేబుల్ నమ్మి సుమారు పదకొండు లక్షల రూపాయలు ఇచ్చి మోసపోయింది, విశాఖ పోలీస్ కమిషనర్ ను కలిసి ఈ విషయం చెప్పి సహాయాన్ని అర్థించగా మహారాణి పెట సి.ఐ.ని కలవమని కమీషనర్ శంకబ్రత బాగ్చి చెప్పగా,వెంటనె మహారాణి పేట సిఐ దివాకర్ యాదవ్ సంబందిత ఎఆర్ కానిస్టేబుల్ ను పిలిపించి మొదట ఐదు రోజులలొ ఆరు లక్షలు,మరొ పదిహేను రోజులలొ ఐదు లక్షలు, మొత్తం పదకొండు లక్షలు బాదితురాలుకు ఇప్పించడంతొ బాధితురాలు కమీషనర్ శంకబ్రత బాగ్చి కు క్రుతజ్ఞతలు తెలుసుకుంటూ రావుఅనుకున్న డబ్బు రావటంతొ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

## పట్టపగలే కొత్త పాలెంలో చోరి

### -ముప్పై వేలు నగదు

### -ముప్పావు తులం బంగారం చోరి

పెన్ పవర్/జనవరి 06 గోపాలపట్నం:: విశాఖ 89 వ వార్డు కొత్త పాలెం లొ పట్టపగలు మిట్ట మధ్యాహ్నం ఓ దొంగ దర్జాగా వచ్చి మిద్ది మీద తాళం తీసుకుని బీరువాలో నగ నట్రా సక్కబెట్టి రాజాలా అక్కడ నుండి సక్కంగా తరలి పోయాడు,ఈ ఘటన కొత్త పాలెం లొ మల్లవారి వీధి లొ సోమవారం చోటుచేసుకుంది,వివరాలోకి వెలితె నిత్యం రద్దీగా ఉండె కొత్త పాలెం ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న మల్లవారి వీధి లొ విజయ్ కుమార్ అనె ఓ స్కూటర్ మెకానిక్ తన కుటుంబం తొ నివసిస్తున్నాడు, అయితే ఎప్పటిలాగే ఆయన భార్య మధ్యాహ్నం పదకొండు గంటలకు ఇంటికి తాళం వేసుకుని ఆ తాళం ఇంటి ద్వారబంధం గడపపై పెట్టి ప్రధాన రహదారి లొ గల తన భర్త షాపు దగ్గరికి వెళ్ళి తిరిగి వచ్చి చూడగా ఇంటి తాళం తీసి దర్జాగా బీరువా తాళం తీసి బీరువాలో గల ముప్పై వేల రూపాయల నగదు, ముప్పావు తులం బంగారం నగలు తీసుకుపోయాడని విజయ్ కుమార్ ఆవేదన తొ తెలిపారు,పైసా పైసా కూడబెట్టిన డబ్బు ఉన్న కొద్దిపాటి బంగారం తస్కరించారని కన్నీటి పర్యంతమయ్యారు,ప్రతీ రోజు గడప పై తాళం పెట్టి బయటకు వెళ్లడం కనిపెట్టి మరీ ఈ పనిచేసారని, పోలీసులు ఈ వీధి లొ ఉన్న ప్రతీ ఒక్కరినీ విచారిస్తె దొంగదొరికె అవకాశం ఉంటుందని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు బాధితుల పిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు,అయితే కొత్తపాలెంలొ రాను రాను దొంగతనాలు, అల్లర్లు, ఎక్కువ అవుతున్నాయని,నిన్న మధ్యాహ్నం మద్యం మత్తులొ ఇద్దరు యువకులు కొత్తపాలెం పోలిపల్లమ్మ గుడి వద్ద ఓ కొబ్బరి బొండాలు అమ్ముకునె వ్యక్తి పై తిరగబడి బొండాలను ఉచితంగా ఇవ్వాలంటూ నానా యాగీ చేసారు, జంక్షన్ లొ గల టిఫిన్ సెంటర్ల వద్ద ఇలాంటి గొడవలు నిత్యకృత్యం గా మారాయి,పోలీసులకు పిర్యాదు చేయగా రెండు రోజుల పాటు విచారణ జరిపి మమ అనిపిస్తున్నారు తప్ప పలితం ఉండటంలేదు,కొత్త పాలెం రోడ్లు మీద తిరగాలంటేనె బయపడుతున్నారు,ఇకనైనా పోలీసులు ఈ ప్రాంతంపై నిఘా పెట్టి ఇటువంటి దురాగతాలు ఆపె విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



## రైతులకు ప్రభుత్వ రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ

తాడేపల్లిగూడెం,పెన్ పవర్/జనవరి 06పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో: రాష్ట్రంలోని రైతులకు ప్రభుత్వ రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతులకు అందజేస్తున్నారని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. నియోజవర్గం లోని పెంటపాడు మండలం రావిపాడు, మీనవలూరుల్లో ఏర్పాటు చేసిన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం పాస్ పుస్తకాలపై జగన్ బొమ్మ వేసి పంపిణీ చేశారని తాతలనాటి ఆ స్త్రీలపై ముఖ్యమంత్రి జగన్ బొమ్మ వేయటం పై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు అని అన్నారు. తల్లిదండ్రుల నుంచి వచ్చిన వారసత్వ ఆస్తులను తనే ఇచ్చినట్టుగా తన బొమ్మ వేసుకోవడం ఉద్యోగం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం పాస్ పుస్తకాలపై రాజముద్ర వేసి వారి ఆస్తి వారికి చెందేల చర్యలు తీసుకున్న మన్నారు. గత ప్రభుత్వం ముసుగులో రాష్ట్రాన్ని లూటీ చేసిందని ఆయన ఆరోపించారు. గ్రామీణ ప్రాంతాల్లో కనీసం రహదారులు కూడా వేయలేకపోయారని ఆయన ఎద్దేవా చేశారు. ప్రధాన రహదారి నుంచి వచ్చే రహదారి పాడిపోయిందని దానిని ఆరు నెలల్లో నిర్మిస్తానని ఆయన హామీ ఇచ్చారు. తాడేపల్లిగూ డెం రావడానికి ప్రధాన రహదారులు లేవని వాటిని పూర్తి చేస్తామన్నారు. నియోజవర్గానికి రహదారి నిమిత్తం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 25 కోట్లు ఇచ్చినట్లు ఆయన చెప్పారు. ఆయనకు మనం ఎంతగానో రుణపడి ఉండాలన్నారు. అనంతరం మీనవూరులో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో మండల ఎంపీపీ కట్టు బోయిన వెంకటలక్ష్మ, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు పుల్లాబాబి, పాలూరి వెంకటేశ్వరరావు, తాడేపల్లిగూడెం మండల జనసేన పార్టీ అధ్యక్షుడు అడపా ప్రసాద్, కట్టు బోయిన కృష్ణ ప్రసాద్, బోరాడ శ్రీను, గుండమ్మగారి సురేష్ గ్రామ సర్పంచులు, సొసైటీ చైర్మన్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు

## తిరుమల శ్రీవారి సేవలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కుటుంబం



కందుకూరు, పెన్ పవర్/జనవరి 06 :కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని మంగళవారం ఉదయం దర్శించుకున్నారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు, సతీమణి సౌజన్య, కుమారులు అవినాష్, సందీప్ లు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలపై శ్రీనివాసుడి చల్లని చూపులు ఎల్లప్పుడూ ఉండాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు స్వామిని కోరుకున్నారు. అలాగే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారధ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మరింత ప్రగతిని సాధించాలని ప్రార్థించారు.. వారి వెంట నెల్లూరు పార్లమెంటు టిడిపి ఉపాధ్యక్షులు మామిళ్ళపల్లి ఓంకార్ దంపతులు, టిడిపి నాయకులు అబ్బూరి చందు, అబ్బూరి వేణు తదితరులు ఉన్నారు.

## పాడేరు మెడికల్ కాలేజీలో సందడే సందడి.

**- ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలతాదేవి ఆధ్వర్యంలో ఘనంగా వార్షికోత్సవ కార్యక్రమాలు ప్రారంభం.**

పాడేరు జనవరి 5 :పెన్ పవర్/జనవరి 06 ఈ నెల 9 న మెడికల్ కాలేజీ మెదటి వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ప్రిన్సిపాల్ డాక్టర్ డి. హేమలతాదేవి ఆధ్వర్యంలో ఘనంగా వార్షికోత్సవ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అరోహన్ పేరిట వార్షికోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలతాదేవి క్రీడా జ్యోతి వెలిగించి, క్రీడా పోటీలను ప్రారంభించారు. ఉదయం నుంచి విద్యార్థులు ఆటపాటలతో, క్రీడా పోటీలతో సందడి చేశారు. ఈ నెల 9 వరకు క్రీడా పోటీలను నిర్వహించి అదే రోజు వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రిన్సిపాల్ డి. హేమలతాదేవి అంకితభావం తో మొదటి సంవత్సరం మెడికల్ కాలేజీలో విద్యాభ్యాసం విజయవంతంగా జరిగిందని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి. హేమాలతాదేవితో పాటూ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పాపారత్నం, డాక్టర్ లక్ష్మ కుమారి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నర్సింగరావు, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎమ్మిగనూరు పట్టణంలోని వీవర్స్ కాలనీ మైదానంలో శ్రీ నీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా నిర్వహించిన ఒంగోలు ఎద్దుల బలప్రదర్శన పోటీల్లో ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి

పెన్ పవర్/జనవరి 06ఎమ్మిగనూరు:

రాష్ట్ర స్థాయిలో ప్రసిద్ధిగాంచిన ఒంగోలు ఎద్దులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఉత్తమ జాతి ఎద్దులు ఈ బలప్రదర్శనలో పాల్గొనడం విశేషం. ఈ కార్యక్రమం రైతులకు ఎంతో ఉత్సాహాన్ని, ఆనందాన్ని కలిగించేదిగా ఉండగా, పెద్ద సంఖ్యలో రైతులు, పశుపోషకులు ఆసక్తిగా వీక్షించారు. ఒంగోలు ఎద్దుల ప్రాముఖ్యతను, వ్యవసాయానికి వాటి పాత్రను గుర్తు చేస్తూ ఈ బలప్రదర్శన రైతు సంస్కృతిని ప్రతిబింబించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రైతులు దేశానికి వెన్నెముకలని, వారి సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తూ రైతుల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తోందని తెలిపారు. రైతులకు అండగా ప్రభుత్వం ఎల్లప్పుడూ నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ల చంద్రశేఖర్ గారు, రైతులు, పశుపోషకులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బుజ్జిగి నాగమ్మ మరణం దళిత జాతికి తీరని లోటు

**నివాళులు అర్పించిన బిఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు రామతీర్థం అమ్రేష్. దేవపుత్ర**

పెన్ పవర్/జనవరి 06 మంత్రాలయం: బూదూరు గ్రామానికి చెందిన బుజ్జిగి నాగమ్మ చిన్న వయసులోనే అనారోగ్య కారణాలు తో మరణించడం దళిత జాతికి తీరని లోటని బి యస్ యస్ నాయకులు రామతీర్థం అమరేష్. నందవరం నరసప్ప, మాల ఉసేని, దేవపుత్ర, సుగుర్ రాజేష్, బాలస్వామి, చిన్న బాలస్వామి, బోయ విజయుడు,రోగన్న, ఈరన్న తదితరులు ఆమె భౌతిక కాయానికి నివాళులర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. బుజ్జిగి నాగమ్మ బుదూర్ గ్రామంలో ఆశ వర్కర్ గా విధులు నిర్వహిస్తూ దళిత ఉద్యమంలో చురుకుగా పాల్గొనేదని ఆమె మరణం జాతికి తీరని లోటని నాయకులు తెలిపారు, నాగమ్మ ఆశయ సాధనలు ముందుకు కొనసాగిస్తామని అన్నారు . ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల బిఎస్ఎస్ నాయకులు పాల్గొన్నారు.




# కీటక జనత వ్యాధులను నివారిద్దాం

***-ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఈరుగులఅన్నపూర్ణ***

తెనాలి పెన్ పవర్/జనవరి 06

తెనాలి పట్టణంలో గల నందుల పేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రము నందు తెనాలి ఉపవైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలపై సమీక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 2026 సంవత్సరం నాటికి సాధించాల్సిన లక్ష్యలను చేయవలసిన విధి విధానాలను గురించి డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ వివరించారు ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం మాట్లాడుతూ కీటక జనిత వ్యాధులను నివారించడంలో ప్రజల భాగస్వామ్యం ఎంతైనా అవసరమని, ఇందుకు అవగాహన కలిగించటం చాలా ముఖ్యమని తెలిపారు .

ఫ్రైడే డ్రై డే గా పాటించాలని కోరారు .

ఈ కార్యక్రమంలో తెనాలి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేసే వార్డు హెల్త్ సెక్రటరీలకు, ఏఎన్ఎం లకు ల్యాబ్ టెక్నీషియన్స్ కు 2026 సంవత్సరం మలేరియా రిజిస్టర్స్ ను ల్యాబ్ రిజిస్టర్ ను అందజేశారు.

కార్యక్రమంలో తెనాలి మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ముువ్వా ఏసుబాబు మాట్లాడుతూ కీటక జంట వ్యాధులు నివారణలో తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామని ప్రజలు నీటి నిలువలు లేకుండా చూసుకోవడం ద్వారా దోమల వ్యాప్తి అరికట్టవచ్చును అని తెలిపారు.

అనంతరం నందుల పేట వైద్యాధికారిని డాక్టర్ వేముల ప్రియాంక మాట్లాడుతూ మాతా శిశు సంరక్షణ సేవలు వ్యాధినిరోధక టీకాలు ప్రతి ఒక్కరికి అందేలా చూడాలని కోరారు.

పినపాడు వైద్యాధికారి డాక్టర్ పరిశపోగుహనూక్ బాబు మాట్లాడుతూ అంటువ్యాధులు మరియు అంటువ్యాధులు కాని వాటిపై అవగాహన కలుగ చేశారు .

కార్యక్రమంలో పద్మశాలిపేట వైద్యాధికారి డాక్టర్ దివికిషోర్ కుమార్,సుల్తానాబాద్ వైద్యాధికారి డాక్టర్ రక్షత్ మారిస్పేట వైద్యాధికారి డాక్టర్ ఎస్ రమేష్, తెనాలి సహాయ మలేరియా అధికారి సిహెచ్ ప్రభాకర్ రెడ్డి, సబ్ యూనిట్ అధికారి సూదశివగణేష్, ఇన్చార్జి సహాయ మలేరియా అధికారి వంగల పున్నారెడ్డి, పట్టణ సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ , ఆరోగ్య విస్తరణాధికారిఅందె బాలచంద్రమౌళి, ఎస్ హెచ్ఐ జి. రవికుమార్, హెల్త్ విజిటర్స్ చింతల ప్రసన్న పుష్పలత సరోజిని హెల్త్ సూపర్వైజర్స్ దీపాల శ్రీనివాసరావు, మల్లేశ్వరరావు, తిరువీధుల శివరాంప్రసాద్, హెల్త్ అసిస్టెంట్స్ ఏఎన్ఎంలు ల్యాబ్ టెక్నీషియన్లుతదితరులు పాల్గొన్నారు

## పట్నంలో పందులను కట్టడి చేసుకోవాలి.. లేనియెడల పట్టుకొని అడవులలో వదులుతాం.. మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు

రేపల్లె పెన్ పవర్/జనవరి 06

పట్నంలో పందులు యదేచ్ఛగా తిరగకుండా సంబంధిత యజమానులు వాటిని కట్టడి చేసుకోవాలని లేనియెడల వాటిని బంధించి అడవులలో వదులుతామని మున్సిపల్ కమిషనర్ కే సాంబశివరావు హెచ్చరించారు మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో పందులు యజమానులతో సమావేశం నిర్వహించారు పందులు వాటి వలన కలుగు ఇబ్బందులపై పట్టణ ప్రజల నుండి అనేక ఫిర్యాదులు అందాయని వీటిని దృష్టిలో పెట్టుకుని సంబంధిత యజమానులు పందులను కట్టడి చేసుకోవాలని ఈనెల 7వ తేదీ బుధవారం రోజు నుండి రేపల్లె పట్టణంలో ఎక్కడైనా పందులు రోడ్లపై సంచరిస్తూ ఉంటే. వాటిని పట్టుకుని అడవుల లో వదులుతామని ఈ సందర్భంగా కమిషనర్ పేర్కొన్నారు... ఈ సమావేశంలో ఇన్చార్జి సానిటరీ ఇన్స్పెక్టర్ సురేంద్ర కుమార్ మున్సిపల్ ఏఈ శామ్యూల్. మేనేజర్ శివప్రసాద్.. సానిటరీ మేస్త్రీలు పందు ల యజమానులు పాల్గొన్నారు..



## బాపట్ల జిల్లాలో విభిన్న ప్రతిభావంతులు వయోవృద్ధులు కొరకు ఉపకరణా లు. సహాయక పరికరాల ఉచిత గుర్తింపు శిబిరములు..- ఈనెల 7 నుండి 13 తేదీ వరకు..

బాపట్ల పెన్ పవర్/జనవరి 06

బాపట్ల ప్రకాశం జిల్లా యంత్రాంగం వారి సహకారంతో.. ఆర్టిఫిషియల్ లిం బా మ్యానుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో ఈ నెల నుండి 13వ తేదీ వరకు బాపట్ల జిల్లాలో దివ్యాంగులు కొరకు ఉపకరణాలు.. సహాయక పరికరాల ఉచిత గుర్తింపు వివరాలు నిర్వహిస్తున్నట్లు.. బాపట్ల ప్రకాశం జిల్లాల విభిన్న ప్రతిభావంతులు వయోవృద్ధులు హిజ్రాల సంక్షమ శాఖ సహాయ సంచాలకులు ఒక ప్రకటనలో తెలిపారు .. 7వ తేదీ ఉదయం 10 నుండి నాలుగు గంటల వరకు వేమూరు లోని జిల్లా పరిషత్ హైస్కూల్ నందు..... 8 తేదీన ఉదయం 10 గంటలు నాలుగు గంటల వరకు మూడో వార్డు మున్సిపల్ హై స్కూల్ రేపల్లె...9. వ తేదీన.. రేపు 10 గంటల నుండి నాలుగు గంటల వరకు బాపట్ల మున్సిపల్ హై స్కూల్ నందు... 10. వ తేదీన.. ఉదయం 10 గంటల నాలుగు గంటల వరకు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల చీరాల .. 12వ తేదీ ఉదయం 10 గంటలు నాలుగు గంటల వరకు జిల్లా పరిషత్ హై స్కూల్ పర్చూరు నందు.. 13వ తేదీన ఉదయం 10 గంటలు నాలుగు గంటల వరకు జిల్లా పరిషత్ హై స్కూల్ అద్దంకి ప్రకాశం జిల్లా నందు ఉచిత గుర్తింపు శిబిరాలు నిర్వహించబడతాయని సహాయ సంచారకులు తెలిపారు.. వికలాంగులు శిబిరానికి వచ్చేటప్పుడు తమ వెంట సదరం.. వైద్య ధ్రువీకరణ పత్రం... రేషన్ కార్డు ఆధార్ కార్డు.. ఆదాయ ధ్రువీకరణ పత్రం.. యు డి ఐ డి. కార్డు రెండు ఫోటోలు.. వారి యొక్క మొబైల్ ఫోన్ నెంబర్ తీసుకుని జిరాక్స్ కాపీలతో శిబిరానికి హాజరు కావలసిందిగా ఆయన కోరారు.. 60 సంవత్సరాలు పైబడిన వయోవృద్ధులు శిబిరమునకు వచ్చేటప్పుడు ఆదాయ ధ్రువీకరణ పత్రం రేషన్ కార్డు ఆధార్ కార్డు రెండు ఫోటోలు మొబైల్ ఫోన్ నెంబర్ తీసుకొని శిబిరానికి రావలసిందిగా సహాయ సంచాలకులు తెలిపారు..



# స్వచ్ఛతతోనే గ్రామ వికాసం సాధ్యం... -జడ్పిటిసి సుబ్బయ్య

రేపల్లె పెన్ పవర్/జనవరి 06.

స్వచ్ఛతతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని నిజాంపట్నం జడ్పిటిసి నర్రా సుబ్బయ్య అన్నారు నిజాంపట్నం పంచాయతీ కార్యాలయం నిర్వహించిన వి బి జి రామ్ జి స్వచ్ఛ సంక్రాంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.. త్రాగునీరు .. గ్రామ అభివృద్ధి పారిశుధ్యం పై ప్రజల భాగస్వామ్యం అవసరమని అన్నారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవోలు కుమారస్వామి శివకుమార్ ఏపీఓ జయ చంద్ర పంచాయితీ కార్యదర్శి సర్పంచి పోలేరమ్మ తదితరులు పాల్గొన్నారు..

## బాధిత కుటుంబానికి నిత్యవసర సరుకులు ఆర్థిక సహాయం అందజేత..



రేపల్లె పెన్ పవర్/జనవరి 06

రేపల్లె రూరల్ మండలం మోర్తోట పంచాయతీ జంగాలపాలెం గ్రామంలో ఇటీవల గ్యాస్ సిలిండర్ పేలి దగ్ధమైన గృహములను సందర్శించి బాధిత కుటుంబాలను పరామర్శించి నిత్యావసర సరుకులు. ఆర్థిక సహాయం మంత్రివర్యులు అనగాని సత్యప్రసాద్ సోదరులు అనగాని శివప్రసాద్ అందజేశారు..

ఈ కార్యక్రమం లో రేపల్లె తాసిల్దార్..మోర్ల శ్రీనివాసరావు, కూచినపూడి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కంతేటి శివరామకృష్ణ (కిట్టయ్య), ఇసుకపల్లి సొసైటీ ప్రెసిడెంట్ కనగాల వెంకటేశ్వరరావు(బాపయ్య) తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు

## ఐలవరం ప్రసన్నాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు:-




రేపల్లె పెన్ పవర్/జనవరి 06

ఐలవరం శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంలో ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా మార్గశిర మాస మంగళవారాన్ని పురస్కరించుకొని ఆలయ ప్రధాన అర్చకులు దీవి రఘునాథ చక్రవర్తి ప్రభాత సేవ,స్వామివారికి ఆకు పూజా కార్యక్రమం అష్టోత్తర నామ పూజా కార్యక్రమం నిర్వహించారు సమరసత నగర సంకీర్తన సంఘం ఆధ్వర్యంలో ప్రతిరోజు గ్రామపురవీధుల్లో ఘనంగా నగర సంకీర్తన కార్యక్రమాలు తెల్లవారుజామున మేలుకొలుపు జరుగుతున్నాయి భక్తులు స్వామివారికి హారతులు సమర్పిస్తున్నారు ఈ కార్యక్రమంలో నగర సంకీర్తన సంఘం కన్వీనర్ కొసనం భాస్కర వెంకటరమణ జొన్నాదుల సాంబశివరావు వామనపల్లి కోటేశ్వరరావు చందులూరి సత్యనారాయణ,ప్రసాదు, నారాయణ,సూర్యావతి తదితరులు పాల్గొన్నారు..



# శరవేగంగా రేపల్లె అగ్నిమాపక శాఖ నూతన అదనపు భవన నిర్మాణ పనులు .

రేపల్లె పెన్ పవర్/జనవరి 06

రేపల్లె తాలూకా ఆఫీస్ ప్రాంగణంలో గల రేపల్లె ప్రకృతి విపత్తుల నిర్వహణ సంస్థ అగ్నిమాపక శాఖ నూతన అదనపు భవన నిర్మాణ పనులు చక చక జరుగుచున్నాయి దాదాపు రెండు సంవత్సరాలకు పైగా భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా మధ్యలో నిలిచిపోయాయి సంబంధిత కాంట్రాక్టర్ గత ప్రభుత్వ హయాంలో నిర్మాణ పనులు చేపట్టి బిల్లులు రావడం ఆలస్యం అవ్వడంతో పనులను ఆపివేశారు అప్పటినుండి భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయి ఆదిలోనే హంసపాదుగా నిలిచిపోయిన అగ్నిమాపక శాఖ అదనపు భవన నిర్మాణ పనులు ఎట్టకేలకు సంబంధిత అగ్నిమాపక శాఖ ఉన్నతాధికారుల జోక్యంతో సుమారు 60 లక్షల రూపాయలు నిధులు మంజూరు కావడంతో కొన్ని నెలలుగా భవన నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే 60 నుండి 70% పైగా నిర్మాణ పనులు పూర్తి అయ్యి ఫిబ్రవరి మూడో వారంలో లేదా మార్చి మొదటి వారంలో నూతన భవన నిర్మాణం ప్రారంభించేందుకు సిద్ధం చేస్తున్నట్లు కాంట్రాక్టర్ తెలిపారు....

## నూతనంగా 6.2 లక్షల జడ్పీ నిధులతో నిర్మిస్తున్న సిసి రోడ్ నిర్మాణానికి శంకుస్థాపన

రేపల్లెపెన్ పవర్/జనవరి 06.నిజాంపట్నం మండలం అముదాలపల్లి పంచాయతీ కొమరవోలు ఎస్సీ, ఎస్టీ కాలనీలో రూ. 6.2 లక్షల జడ్పీ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి మంగళవారం జడ్పీటీసీ సభ్యులు నర్రా సుబ్బయ్య శంకుస్థాపన చేశారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి నర్రా సుబ్బయ్య గారు పూలమాలలు వేసి ఘన నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షుడు పందరబోయిన శ్రీనివాసరావు, టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు మరక నాగరాజు, సర్పంచ్ నర్రా కృష్ణ, టీడీపీ నాయకులు కుమారస్వామి, దబ్బకూటి వెంకేశ్వరరావు, కన్నెటి హరిబాబు, కట్టుపల్లి ప్రభాకర్, శ్రీనివాసరావు, గ్రామస్తులు పాల్గొన్నారు....



## ఎన్టీఆర్ విగ్రహం కూడలి సెంటర్లో శాశ్వతమైన పుర వేదిక ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ప్రజలు వినతి

రేపల్లె పెన్ పవర్/జనవరి 06

రేపల్లె మున్సిపాలిటీ 1957లో ఏర్పాటు చేసినారు, అప్పటినుండి నేటి వరకు నియోజక వర్గానికి రేపల్లె పట్టణంలో ఉన్న నెహ్రూ. ఎన్టీఆర్ విగ్రహాల. కూడలిలో పురజనుల వేదిక కొరకు అన్ని రాజకీయ పార్టీలకు పబ్లిక్ సంస్థలు, మీటింగులకు డయాస్ వరకు స్లాబ్ తో కూడిన ఆర్ సి సి స్టేజి ఏర్పాటు చేసుకున్నట్లయితే మన పట్టణానికి సుందరమైన ప్లేస్. ప్లాన్ లో భాగంగా స్పేస్ ఉన్న యెడల వాటర్ ఫౌంటైన్ విత్ గ్రీన్ గ్రాస్ తో, చక్కటి లైటింగ్ తో, బాపట్ల ఎంపీ నిధుల ద్వారా త్వరలో బడ్జెట్ మంజూరు చేయించి రాష్ట్ర మంత్రివర్యులు సత్య ప్రసాద్ ఆశీస్సులతో త్వరలో నెహ్రూ విగ్రహం వద్ద శాశ్వతమైన వేదిక ఏర్పాటు చేయించాలని పట్టణ ప్రజలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కోరుతున్నారు. గతంలో ప్రకాశం స్కూల్లోని ఓపెన్ థియేటర్లో సమావేశాలు జరుపుకునేందుకు వీలుగా ఉండేది దానిని గత వైసీపీ ప్రభుత్వంలో పూర్తిగా తొలగించడం జరిగింది అప్పటినుండి సభలు సమావేశాలు జరుపుకునేందుకు సరైన వేదిక రేపల్లి పట్టణంలో లేదు అందువలన అటు రాజకీయ పార్టీలు ప్రభుత్వ ప్రైవేటు సంస్థల అధికారులు నెహ్రూ విగ్రహం లేదా అంబేద్కర్ విగ్రహం వద్ద వేదికగా సమావేశాలు నిర్వహిస్తున్నటువంటి సందర్భాలు పట్టణంలో చోటుచేసుకుని ఉన్నాయి అందువలన పట్నంలో ప్రధానమైన నెహ్రూ విగ్రహం ఎన్టీఆర్ విగ్రహాల సెంటర్లో పురజనుల కోసం శాశ్వతమైన వేదికను ఏర్పాటు చేస్తే బాగుంటుందని పట్టణ ప్రజలు పలు రాజకీయ పార్టీల నాయకులు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు



## రేపల్లెలో ఈనెల8వ తేదీ జరగవలసిన హెచ్ పి వి వ్యాక్సినేషన శిబిరం వాయిదా

రేపల్లె పెన్ పవర్/జనవరి 06 రోటరీ క్లబ్ గుంటూరు

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ గుంటూరు వారి సంయుక్త నిర్వహణలో ఈనెల 8వ తేదీన పట్టణంలోని ఎంసీఏ హాల్లో జరగవలసిన బాలికల హెచ్ పి వి..వ్యాక్సినేషన్ శిబిరం వాయిదా వేయబడినది. విద్యార్థులకు పరీక్షలు ఉండటం వలన ఇంటర్నేషనల్ రోటరీ క్లబ్ సభ్యుల రాక, ఆలస్యం అగుటవలన శిబిరం వాయిదా వేయబడినది. సంక్రాంతి తర్వాత మరల తేదీ ఇవ్వబడును. ఐఎంఏ ,ఎంసీఏ సంయుక్త పర్యవేక్షణలో ఈ శిబిరం నిర్వహించబడుతుంది.

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ,రేపల్లె రేపల్లె బ్రాంచ్ కార్యదర్శి డాక్టర్ వసంతం వీరరాఘవయ్య మంగళవారం తెలిపారు..

## బాధిత కుటుంబానికి నిత్యవసర సరుకులు.. బట్టలు అందజేత

రేపల్లె..పెన్ పవర్/జనవరి 06

రేపల్లె రూరల్ మండలం మోర్తోట పంచాయతీ జంగాలపాలెం గ్రామంలో ఇటీవల గ్యాస్ సిలిండర్ పేలి దగ్ధమైన గృహములను సందర్శించి బాధిత కుటుంబాలను పరామర్శించి నిత్యావసర సరుకులు బట్టలు అందచేయడం జరిగింది.. ఈ కార్యక్రమం రూరల్ కన్వీనర్, యేమినేని డేనియల్ బాబు,పిన్ని సాంబశివరావు , అన్నం సాయి రాజు బీజేపీ నాయకులు పాల్గొన్నారు



# టూరిజం కార్పొరేషన్ చైర్మన్ ను కలసిన రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్

తిరుపతి నవంబర్ 6పెన్ పవర్/జనవరి 06 : తిరుపతికి విచ్చేసిన రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నుకసాని బాలాజీ ని మంగళవారం శ్రీ తాతయ్యగుంట ఆలయంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ తోట వాసుదేవ్ రాయల్, శ్రీ తాతయ్యగుంట గంగమ్మ ఆలయ చైర్మన్ నైనార్ మహేష్ యాదవ్ లు మర్యాదపూర్వకంగా కలిసి శాలువలతో సన్మానించారు. అనంతరం టూరిజం కార్పొరేషన్ చైర్మన్ కుటుంబ సభ్యులతో కలిసి శ్రీ తాతయ్య గుంట గంగమ్మ అమ్మవారి దర్శనానికి బయలుదేరు వెళ్లారు. టూరిజం కార్పొరేషన్ చైర్మన్ కలసిన వారిలో కార్పొరేటర్ అన్నా అనిత, తెలుగు యువత నేతలు రంజిత్ నాయుడు, హర్ష కూడా ఉన్నారు.



# ప్రకాశం జిల్లాలో పోలీస్ స్టేషన్‌ల విలీనం నేపథ్యంలో ఉలవపాడు స్టేషన్‌ను పరిశీలించిన ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు, ఐపీఎస్

-రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలి

-నేర నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడికి గట్టి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించిన జిల్లా ఎస్పీ

-తరుచు విజిబుల్ పోలీసింగ్ చేపడుతూ నేరాలను కట్టడి చెయ్యాలి

-పోలీస్ సిబ్బంది క్రమశిక్షణ, వృత్తిపట్ల నిబద్ధత,అంకిత భావంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి:జిల్లా ఎస్పీ






కందుకూరు, పెన్ పవర్/జనవరి 06

ప్రకాశం జిల్లాలో కందుకూరు సబ్ డివిజన్ ను కలపటం (విలీనం) ప్రక్రియలో భాగంగా ఉలవపాడు పోలీస్ స్టేషన్ స్థితిగతులు, సిబ్బంది పని తీరును, కేసుల నమోదు, ప్రజలకు అందుతున్న సేవలు, శాంతి భద్రతలను క్షేత్ర స్థాయిలో పరిశీలించడానికి ఉలవపాడు పోలీస్ స్టేషన్ మంగళవారం జిల్లా ఎస్పీ సందర్శించి పోలీస్ స్టేషన్ ఆవరణాన్ని,గదులను, రిసెప్షన్ కౌంటర్, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. పట్టుబడిన వాహనాలు మరియు తదితర రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.పోలీస్ స్టేషన్ పరిధిలో లా అండ్ ఆర్డర్, నేర నివారణ వ్యూహాలపై తీసుకుంటున్న చర్యలపై అధికారులను ఆరా తీసి పలు సూచనలు చేసారు. పోలీస్ స్టేషన్ లో పెండింగ్ కేసుల వివరాలు తెలుసుకొని వాటిని త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి తక్షణమే పిర్యదుదారులకు పరిష్కారం అందించాలని, మహిళల భద్రత విషయంలో ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని, మహిళలు/చిన్నారులపై జరిగే అకృత్యాలకు సంబంధించి వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. చెడు నడతకలిగిన వారి కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ప్రతి వాహనదారుడు హెల్మెట్ వాడాలని, రోడ్డు భద్రత నియమాలు పాటించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పండుగలు, ఉత్సవాల సమయంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. స్టేషన్ విలీనంతో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, పోలీస్ సేవలు మరింత వేగవంతంగా, సమర్ధవంతంగా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా ఫిర్యాదులపై సత్వర స్పందన, కేసుల దర్యాప్తులో నాణ్యత, రికార్డుల నిర్వహణలో స్పష్టత ఉండాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కను నాటి చుట్టూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.




**గుడ్లూరు పోలీస్ పరిధిలో ఉన్న ఇండోసోల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను మరియు రామాయపట్నం పోర్ట్ ప్రాంతాన్ని సందర్శించిన జిల్లా ఎస్పీ**

ఈ సందర్భంగా ఇండోసోల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్‌లో కొనసాగుతున్న నిర్మాణ పనులు, కార్మికుల భద్రత, పారిశ్రామిక కార్యకలాపాలు మరియు భవిష్యత్ ప్రణాళికలపై జిల్లా ఎస్పీకి వివరించారు. నిర్మాణ ప్రాంతాల్లో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా తగిన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు.అనంతరం రామాయపట్నం పోర్ట్ నిర్మాణ ప్రాంతాన్ని జిల్లా ఎస్పీ పరిశీలించారు. పోర్ట్ అధికారులు అక్కడ జరుగుతున్న పనులు, స్థితిగతులను జిల్లా ఎస్పీకి వివరించారు. పోర్ట్ పరిధిలో భద్రతా ఏర్పాట్లు, పోర్ట్ అభివృద్ధి నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోనే పోర్టు ఒక ముఖ్యమైన ప్రాంతమని, పోర్టు యాజమాన్యం సమన్వయముతో భద్రతను పటిష్టంగా ఉంచాలన్నారు.జిల్లా ఎస్పీ వెంట ఎస్బి డిఎస్పీ చిరంజీవి, కందుకూరు డిఎస్పీ సిహెచ్. వి. బాలసుబ్రమణ్యం, కందుకూరు సిఐ షైక్ అన్వర్ బాషా, గుడ్లూరు సీఐ జి.మంగారావు, ఉలవపాడు ఎస్సై వెంకటరావు, గుడ్లూరు ఎస్సై వెంకటరావు మరియు సిబ్బంది ఉన్నారు.

# ఘనంగా దద్దాల తనయుడు జ్ఞాన్ క్రిత్విక్ యాదవ్ జన్మదిన వేడుకలు..

పార్టీ శ్రేణుల మధ్య -కనిగిరి పార్టీ కార్యాలయం లో కేక్ కటింగ్-20 మంది చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు పంపిణీ

-జ్ఞాన్ క్రిత్విక్ ను ఆశీర్వదించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు

కనిగిరి టౌన్, :
పెన్ పవర్/జనవరి 06

కనిగిరి నియోజకవర్గం వైయస్ఆర్‌సీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ తనయుడు దద్దాల జ్ఞాన్ క్రిత్విక్ యాదవ్ మూడవ జన్మదిన వేడుకలను స్థానిక పార్టీ ఆఫీస్ లో నియోజకవర్గం వైయస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు మధ్య ఘనంగా నిర్వహించారు.కేక్ కటింగ్ చేసి జ్ఞాన్ క్రిత్విక్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసారు.ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని,ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో నిండునూరేళ్లు జీవించాలని ఆశీర్వదించారు. తన కుమారుడు దద్దాల జ్ఞాన్ క్రిత్విక్ యాదవ్ పుట్టినరోజు పురస్కరించుకొని నియోజకవర్గంలోని 20 మంది పేద చిరువ్యాపారులకు ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ ఆధ్వర్యంలో తోపుడు బండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిరు వ్యాపారాలు చిరంజీవి జ్ఞాన్ క్రిత్విక్ ను ఆశీర్వదించి, దద్దాల నారాయణ యాదవ్ కి కృతజ్ఞతలు తెలిపి ఆనందం వ్యక్తం చేశారు.

ఈ వేడుకలో షేక్ అబ్దుల్ గఫార్,మడతల కస్తూరి రెడ్డి, కల్లూరి రామిరెడ్డి,గోపవరపు బొర్రారెడ్డి,గజ్జల వెంకటరెడ్డి, యక్కండి శ్రీనివాసుల రెడ్డి,చింతగుంట్ల సాల్మన్ రాజు, సూరసాని మోహన్ రెడ్డి,గాండ్లపర్తి ఆదినారాయణ రెడ్డి, పులి శాంతి,తమ్మనేని సుజాత, అయిమల్ల నాగమణి, వాకమల్ల రాజశేఖర్ రెడ్డి,డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, డాక్టర్ షేక్ నాయబ్ రసూల్,ముల్లంగి శ్రీహరి రెడ్డి,పోలక సిద్ధారెడ్డి,రాచపూడి మాణిక్యరావు,గూడూరి అబ్రహం లింకన్,మూలే గోపాల్ రెడ్డి,షేక్ ఖాజామహిద్దీన్,షేక్ చాంద్ భాషా,షేక్ గయాజ్,పులి శ్రీనివాసుల రెడ్డి,చింతం శ్రీనివాసులు,సిరుప గోవర్ధన్ రెడ్డి,రామనబోయిన శ్రీనివాసులు,దాసరి మురళి,ఎలిక నారాయణ,కుప్పనబోయిన వెంకటరామయ్య, దాదిరెడ్డి మాలకొండ







రెడ్డి,సిగ కృష్ణారావు,కాకర్ల వెంకటేశ్వర్లు, గూడూరి అనిల్ బాబు,మేకల మాల్యాద్రి,దద్దాల రాములు,అత్యాల ఇసాక్,ముద్దా బాబు,లోకిరెడ్డి అంకిరెడ్డి,కలికాయి నారాయణ,చింతగుంట్ల కిషోర్ బాబు, చిన్నయ్య,దేవర వెంకటేశ్వర్లు,దరిశి సుబ్రహ్మణ్యం,బచ్చు వెంగళరావు గుప్తా,పల్నాటి భాస్కర్ రెడ్డి,ఆవుల తిరుపతిరెడ్డి,తెల్లగడ్డ వెంకటరావు,దామిరెడ్డి నాగేందర్ రెడ్డి,మద్దిశెట్టి భారతి,షేక్ షకీల,వేముల రేష్మ,లక్ష్మ, అచ్చాల శ్రీనివాసుల రెడ్డి,కన్నెటి సుబ్బారెడ్డి,యాళ్ళ కృష్ణారెడ్డి,తమ్మనేని వెంకటరెడ్డి,షేక్ ఖాసిం వలీ,షేక్ నాగూర్ వలి,షేక్ కరీం భాష,బత్తుల మాలి, చిల్లా వెంకటసాయి,పలుకూరి భాస్కర్,షేక్ షరీఫ్,వంకదారి రాజా,రేగుల బాలయ్య చౌదరి,శీలం సుదర్శన్,గుంటగాని భాస్కరరావు,శ్యామల సాంబిరెడ్డి,సంగటి మహేందర్ రెడ్డి ,సాని కొమ్ము వెంకటేశ్వర్ రెడ్డి,తాతపూడి నాని,గజ్జల నాగిరెడ్డి,షేక్ కాలేషా,నల్లగంగుల శ్రీను,కొండ్రు నరసింహ, పరిమి వెంకటరావు చౌదరి,మిట్ట రమేష్ రెడ్డి,చిలకల నారాయణరెడ్డి,రంగయ్య,డబ్బుకొట్టు రవికుమార్,నాలి వెంకటేశ్వర్లు,నాలి వెంకట రమణయ్య,పెరికల వెంకటేశ్వర్లు,గాలి నాగేశ్వరరావు,రాచర్ల నరేష్ ,పాపన బోయిన నాగరాజు,చీమలదిన్నె శివ,కేతినేని నరసింహ, జొన్నలగడ్డ ప్రహల్లాద,ఫౌండ్రి కొండారెడ్డి,ఏకుల వెంకటసుబ్బారెడ్డి,షేక్ నాగూర్ భాష, కాంచని లక్ష్మరెడ్డి, కాకర్ల మధు,మర్రి రాజు, రాచకొండ మహేంద్ర, మేకల వెంకటేశ్వర్ల తదితరులు పాల్గొన్నారు.





# కొత్త శివాలయం రోడ్డు నందు పోలీసుల కార్డినల్ సెర్చ్ కార్యక్రమం...

**కావలి:** పెన్ పవర్/జనవరి 06

కావలి పట్టణంలోని కావలి రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న తుఫాన్ నగర్ మరియు కొత్త శివాలయం రోడ్డు నందు సోమవారం రాత్రి 8.30 గంటలకు కావలి డిఎస్పి శ్రీధర్ ఆధ్వర్యంలో కార్డినల్ సెర్చ్ కార్యక్రమంలో భాగంగా అనుమానితులైన వ్యక్తుల ఇళ్ల కి పోలీసులు వెళ్లి వివరాలు అడగడం జరిగింది.ఈ సెర్చ్ కార్యక్రమంలో 14 బైకులను రెండు ఆటో లను స్వాధీనం చేసుకున్నారు.పదిమంది అనుమానితులను విచారించారు. ఈ సందర్భంగా స్థానికంగా అక్కడున్న యువకులకు మహిళలకు నేరాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డిఎస్పి శ్రీధర్ మాట్లాడుతూ గంజాయి ఎవరైనా విక్రయిస్తున్న సరఫరా చేసిన ఎవరైనా అనుమానితులు కనిపిస్తే పోలీసులకు తెలపాలని అక్కడి వారికి తెలిపారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీధర్ తో కలిసి ఒకటవ పట్టణ,రెండవ పట్టణ,రూరల్ సిఐలు,ఎస్ఐలు పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# అలేఖ్య.... ఆత్మగౌరవంలో రాజీ పడేది లేదని సత్తా చాటిన ఆర్యవైశ్య అతివ

కావలి, పెన్ పవర్/జనవరి 06

ఆమె పేరు పోతుగంటి అలేఖ్య. నాలుగు దశాబ్దాల కాలం పాటు కావలి రాజకీయాలను తనదైన రీతిలో శాసించిన దివంగత గ్రంధి యానాదిశెట్టి ఏకైక రాజకీయ వారసురాలు.గత సార్వత్రిక ఎన్నికలకుముందు కావలిలో ఆర్యవైశ్యులంతా గంపగుత్తగా తెలుగుదేశంపార్టీకి ఓట్లు వేయడం అందరికీ తెలిసిందే. అందుకు ప్రతిఫలంగా ఆ సామాజిక వర్గానికి చెందిన యానాదిశెట్టి కుమార్తె అలేఖ్యకు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటి నామినేటెడ్ హోదాను పార్టీ అధిష్టానం అప్పగించింది. అయితే ఆ హోదాలో ఉన్న ఆమెను మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇరుకున పెడుతుండతో ఆమె చాలా కరకుగానే రాజకీయంగా పావులు కదిపారు. తన ఆభిమాతాన్ని గౌరవించే పార్టీ పెద్దల దృష్టికి స్థానికంగా చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలపై ఏకరవు పెట్టారు. అలేఖ్య న్యాయమైన గోడు ఆలకించిన పార్టీ అగ్ర నాయకులు ఆమెకు భరోసాగా బాట వేశారు. సదరు మార్కెట్ కమిటీ కార్యదర్శిని సాగనంపారు. ఇప్పుడు అందరికీ అర్థమైంది.... ఆర్యవైశ్యులనుకుంటే చేయలేనిది అంటూ ఏమీ ఉండదు అని..ఆ దిశగా ఈ సామాజిక వర్గానికి చెందిన ఓ మహిళ చాటిచెప్పడం ఎంతైనా ప్రశంసనీయమే



# వ్యక్తి కనిపించడం లేదని కడియం పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు.



కడియం
పెన్ పవర్/జనవరి 06

కడియం మండలం, వేమగిరి గ్రామానికి చెందిన కోలా రామకృష్ణ (63) అనే వ్యక్తి కనిపించడం లేదని తమ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయినట్లు కడియం సిఐ అల్లు వెంకటేశ్వరరావు తెలిపారు. జనవరి 4, 2026 తేదీన ఇంటి నుండి బయటకు వెళ్లారని, ఇప్పటివరకు తిరిగి రాలేదని రామకృష్ణ అల్లుడు అల్లంపల్లి సత్యనారాయణ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. రామకృష్ణ బయటకు వెళ్లేటప్పుడు నలుపు రంగు ప్యాంటు, లేత పసుపు రంగు షర్ట్ మరియు తలకు నల్లరంగు మంకీ క్యాప్ పెట్టుకుని ఉన్నారని, గత కొన్ని రోజులుగా గ్యాస్ట్రో హాస్పిటల్ నందు చికిత్స తీసుకుంటున్నారని, ఎవరికైనా సమాచారం తెలిస్తే తమ పోలీస్ స్టేషన్లో సంప్రదించాలని కోరారు. దీనిపై కడియం పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు

# రోగాలకే చుక్కలు చూపించే ఆకు కూర



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆకు కూరల్లో ఎన్నో పోషకాలు దాగున్నాయి.. ఇవి మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అందుకే.. వీటిని రెగ్యులర్‌గా తినాలని సూచిస్తున్నారు డైటీషియన్లు..అలాంటి ఆకు కూరల్లో చుక్క కూర (ఖట్టా పాలక్) ఒకటి.. చుక్కకూర, సాధారణంగా వంటకాల్లో పుల్లని రుచి కోసం ఉపయోగించే ఆకుకూర.. వాస్తవానికి అనేక అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ఇది కేవలం నోటికి రుచిని ఇవ్వడమే కాకుండా, శరీరానికి అవసరమైన పోషకాలను అందించి, వివిధ ఆరోగ్య సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తుంది. ఈ ఆకుకూరను రోజూ ఆహారంలో చేర్చుకోవడం వల్ల కలిగే లాభాలను వివరంగా తెలుసుకుందాం.

**పోషకాల గని చుక్కకూర:**
చుక్కకూరలో విటమిన్‌లు ం, అ సమృద్ధిగా ఉంటాయి. అంతేకాకుండా, ఐరన్, మెగ్నీషియం, కాల్షియం, పొటాషియం వంటి ముఖ్యమైన ఖనిజాలు ఇందులో పుష్కలంగా లభిస్తాయి. బీటా కెరోటిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు కూడా చుక్కకూరలో అధిక మోతాదులో ఉంటాయి. ఈ పోషకాలన్నీ శరీర ఆరోగ్యాన్ని కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తాయి.

**చుక్కకూర ప్రయోజనాలు..**
జీర్ణవ్యవస్థకు మేలు చేస్తుంది: చుక్కకూర జీర్ణ వ్యవస్థను మెరుగుపరుస్తుంది. నీళ్ల విరేచనాలు తగ్గించడానికి, మలబద్ధక సమస్యను దూరం చేయడానికి ఇది చాలా సహాయపడుతుంది. ఇందులో ఉండే ఫైబర్ కంటెంట్ జీర్ణక్రియను సులభతరం చేస్తుంది.
శరీరానికి చలువ: శరీరం వేడిగా ఉన్నప్పుడు, చుక్కకూరను ఆహారంలో తీసుకోవడం వల్ల ఒంట్లో వేడి తగ్గుతుంది.. శరీరం చల్లబడుతుంది. అధికంగా దప్పిక వేసేవారు కూడా ఈ ఆకుకూరను తీసుకోవడం ద్వారా సమస్యను నియంత్రించుకోవచ్చు. వాంతులు ఎక్కువగా అవుతున్నప్పుడు చుక్కకూరతో చేసిన వంటకాలు తినడం వల్ల వాంతులు తగ్గుతాయి.
**గుండె ఆరోగ్యం:** చుక్కకూరలో ఉండే ఐరన్ శరీరంలోని అన్ని భాగాలకు ఆక్సిజన్‌ను సమర్థవంతంగా చేరవేయడానికి సహాయపడుతుంది. ఇది గుండెపై ఒత్తిడిని తగ్గించి, గుండె జబ్బులు రాకుండా కాపాడుతుంది. అధిక రక్తపోటు సమస్య ఉన్నవారికి కూడా చుక్కకూర ప్రయోజనకరంగా ఉంటుంది. శరీరంలో పేరుకుపోయిన కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది.
రోగనిరోధక శక్తి పెంపు: విటమిన్ అ, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండటం వల్ల చుక్కకూర శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ఇది క్యాన్సర్ కణాల వృద్ధిని నియంత్రించడంలో సహాయపడి, క్యాన్సర్ వ్యాధి రాకుండా అడ్డుకుంటుంది.
**షుగర్, కిడ్నీ రోగులకు కూడా మంచిది:** షుగర్ వ్యాధిగ్రస్తులకు చుక్కకూర చాలా మంచిది. ఇంకా కిడ్నీల సమస్యలు ఉన్నవారు కూడా ఈ ఆకుకూరను తీసుకోవచ్చు. రక్తహీనతతో బాధపడేవారికి చుక్కకూర ప్రయోజనకరంగా ఉంటుంది.. ఇది ఎర్ర రక్త కణాల వృద్ధికి తోడ్పడుతుంది.

**పుల్లని రుచి కలిగిన చుక్క కూరను ఈజీగా చేసుకోవచ్చు..**
చుక్క కూరను చాలా సింపుల్ గా జ్యూసీగా వండుకోవచ్చు.. చుక్కకూర కాడలు లావుగా, ఆకులు మందంగా, వెడల్పుగా ఉంటాయి. దాని పుల్లని రుచి ప్రత్యేకతను తీసుకువస్తుంది. దీనిలో రెండు టమోటాలను జోడించడం ద్వారా.. రుచి మరింత పెరుగుతుంది. ఈ అద్భుతమైన ఆకుకూరను మన రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితాన్ని సొంతం చేసుకోవచ్చు.

# జాగ్రత్త మిత్రమా!.. వ్యాధుల ఉచ్చులో చిక్కుకోవద్దు

**హైదరాబాద్ పెన్ పవర్:** తస్మాత్ జాగ్రత్త! అన్ని విషయాల్లోనూ పెద్దలు చెప్పే మాట ఇది. ముందుచూపు ఉన్నవాడే ముందడుగు వేయగలడు.ఆర్థిక విషయాల్లోతప్పటడుగు వేస్తే.. రెండేండ్లకో, మూడేండ్లకో కోలుకునే అవకాశం ఉంటుంది. ఆరోగ్యం విషయంలో ఈ సూత్రం చెల్లదు. 'నాకేమవుతుంది!' అన్న నిర్లిప్త ధోరణి మిమ్మల్ని రోగాల విష వలయంలోకి నెట్టేయొచ్చు. ఆరోగ్య బీమా ఉంటే.. చికిత్సకయ్యే ఖర్చులు మీదపడకుండా ఉంటాయి కానీ, మీ బీమా రోగం రాదన్న ధీమా ఇవ్వదు కదా!! మరెలాగంటారా?! ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, క్రమబద్ధమైన జీవనశైలితో రాగల రోగాలను అడ్డుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు. ఎలాంటి వ్యాధులనైనా నయం చేసే శక్తి ఆధునిక వైద్యరంగానికి ఉంది! కానీ, అదే సమయంలో వేగంగా పెరుగుతున్న రోగాలు వైద్యులకూ సవాళు విసురుతున్నాయి. ఈ నేపథ్యంలో వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరం అంటున్నారు వైద్యులు. గతంతో పోలిస్తే.. ఈ మధ్య కాలంలో ఎలాంటి వ్యాధులు పెరుగుతున్నాయి, అందుకు కారణాలేంటి? మారుతున్న జీవనశైలి మనిషి ఆరోగ్యాన్ని ఎలా ప్రభావితం చేస్తున్నది? తదితర అంశాలను నేటి ఊపిరిలో తెలుసుకుందాం!ప్రివెన్షన్ ఈజ్ బెటర్ దెన్ క్యూర్' నానుడి ఆరోగ్యానికి సంబంధించినదే! సంపాదన వేటలో పరుగులు తీస్తున్న మనిషి ఆరోగ్యాన్ని చాలా నిర్లక్ష్యం చేస్తున్నాడు. దీనికితోడు జిహ్వ చాపల్యాన్ని చంపుకోలేక, అలవాట్లు మానుకోలేక, వ్యాయామం చేసే తీరిక లేక? ఇలా రకరకాల కారణాలతో రోగాలను కొని తెచ్చుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో నడి వయసులోనే దవాఖానల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ముప్పయ్ ఏండ్లలోనే గుండె జబ్బులు పలకరిస్తున్నాయి. నలభై రాకముందే కిడ్నీలు మొరాయిస్తున్నాయి. డబ్బుల్లో రావాల్సిన నరాల సమస్యలు? యాభై రాకముందే ముంచుకొస్తున్నాయి. దీనికంతటికీ కారణంఆరోగ్యంపై శ్రద్ధ లేకపోవడమే!

ముప్పయ్ రాకుండానే.. గుండెకు ముప్పు
ఒకప్పుడు యాభై ఏండ్లు దాటాక గానీ, గుండె సమస్యలు పలకరించేవి కావు. కానీ, ఇప్పుడు ముప్పయ్‌లోకి అడుగు పెట్టకముందే గుండె సంబంధిత రుగ్మతలు వస్తుండటం ఆందోళన కలిగిస్తున్నది, 20–30 ఏళ్లలోపు వయసు వారు కూడా తీవ్రమైన గుండె జబ్బులకు గురవడం విచారకరం. అయితే చిన్న వయసులోనే గుండె సంబంధిత వ్యాధులకు గురైనవారిలో ఎక్కువ శాతం రక్తపోటు లేదా అధిక కొలెస్ట్రాల్ సమస్యలతో బాధపడుతున్నట్టు పరిశోధనలు చెబుతున్నాయి. ఈ తరహా సమస్యల్లో చిక్కుకుంటున్న వాళ్లు కనీస



ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు కూడా చేయించుకోకపోవడం గమనార్హం. తాజా అధ్యయనాల ప్రకారం గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న రోగుల్లో సుమారు 30 శాతం మంది 30 ఏళ్లలోపు వారే ఉంటున్నారట. వీరంతా అసహజమైన జీవనశైలి కారణంగానే ఇలాంటి వ్యాధులతో బాధపడుతున్నారు. గణాంకాల ప్రకారం భారతదేశంలో 40 ఏళ్లలోపు వయసున్న ప్రతి నలుగురిలో ఒకరికి గుండెపోటును చూస్తున్నాం. సరైన జీవనశైలి, వ్యాయామం, నడక, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు పాటించడం ద్వారా గుండెకు వచ్చే జబ్బులను చాలా వరకు నియంత్రించవచ్చు.యువతలో బలహీనతన్యూరాలజిస్టుల నివేదికల ప్రకారం స్ట్రోక్ కేసులను పరిశీలిస్తే, దాదాపు మూడోవంతు యువతలోనే నమోదవుతున్నాయి. దీనికి అధిక రక్తపోటు, పొగ తాగడం, మద్యం సేవించడం, ఒకేచోట ఎక్కువ సేపు కూర్చుని ఉండే ఉద్యోగాలు చేయడం వల్ల న్యూరాలజీ సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. చేతులు కాలాక ఆకులు పట్టుకోకుండా.. ముందస్తుగా మేల్కొనాలి. దురలవాట్లకు చెక్ పెట్టాలి. వర్క్ ?స్టైల్‌నిమీ ఆరోగ్యానికి తగ్గట్టుగా డిజైన్ చేసుకోవాలి. ఆరోగ్యపరంగా ఏదైనా అసౌకర్యాన్ని గుర్తించిన వెంటనే వైద్యుణ్ని సంప్రదించాలి. పీడిస్తున్న మధుమేహంజీవనశైలి రుగ్మతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. కాస్త అలవాట్లు పక్కదారి పట్టినా.. మధుమేహం
దాడి చేస్తున్నది. గతేడాది యువ ఉద్యోగులు, విద్యార్థుల్లో మధుమేహం, ఊబకాయ సమస్య అనూహ్యంగా పెరగడం కనిపించింది. ఎండోక్రైనాలజీ విభాగం గణాంకాల ప్రకారం, టైప్–2 మధుమేహం యువతలో వేగంగా పెరుగుతున్నది. సుమారు 40 శాతం మందికి తమకు డయాబెటిస్ ఉందన్న విషయమే తెలియకపోవడం గమనార్హం. అంతేకాదు, మధుమేహ బాధితుల్లో 50 శాతం మందిలో వ్యాధి అస్సలు నియంత్రణలో ఉండటం లేదట. దీనివల్ల మూత్రపిండాల సమస్యలు, గుండె వ్యాధులు, సంతానలేమి తదితర సమస్యలు చాపకింద నీరులా విస్తరిస్తుండటం ఆందోళన కలిగించే అంశం. నెఫ్రాలజీ రికార్డుల ప్రకారం, డయాబెటిస్, హైపర్ టెన్షన్‌ను సమయానికి గుర్తించకపోవడం వల్ల యుక్త వయసులోనే తీవ్రమైన కిడ్నీ వ్యాధుల బారినపడుతున్నారు. వీటిని ప్రాథమిక దశలో గుర్తించి, తగిన చికిత్స తీసుకుంటే ప్రమాద తీవ్రత గణనీయంగా తగ్గుతుంది.

# డబుల్ డిన్నర్ ట్రబుల్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆలస్యంగా తినడం అందరి సమస్యే. ఒక్కోసారి సమయం కలిసొచ్చి.. తినాల్సిన సమయం కంటే ముందే తింటారు. ఆలస్యంగా నిద్రపోవడం, రాత్రి పని చేసేవాళ్లకు అర్ధరాత్రి మళ్లీ ఆకలవుతుంది.రాత్రి రెండో డిన్నర్ లాగించేస్తారు. తరచుగా డబుల్ డిన్నర్ తినేవాళ్లకు ఆకలి సమస్యలు ఉంటాయి. నిద్రలేమి, అధిక బరువు అదనపు సమస్యలు తప్పవని ఆహార నిపుణులు హెచ్చరి స్తున్నారు.ఓటీటీలో షోలు చూస్తూ, థియేటర్లో సినిమాలు, క్రికెట్ మ్యాచ్‌లు, మ్యూజిక్ కాన్సర్ట్, ట్రావెల్, రాత్రి వేళ ఉద్యోగ విధులు చేసేవాళ్లలో చాలామంది డబుల్ డిన్నర్ సమస్య ఎదుర్కొంటున్నారు. డిన్నర్ సరైన సమయానికే చేసినా.. రాత్రి ఎక్కువ సమయం మేల్కొని ఉండటం వల్ల వీళ్లకు మళ్లీ ఆకలవుతుంది. అప్పుడు భోజనం, లేకపోతే ఇష్టమైన స్నాక్స్‌ని కడుపునిండా ఆరగిస్తారు. అప్పటికే మొదటి డిన్నర్ ద్వారా శరీరానికి కావాల్సినంత ఎనర్జీ అందుతుంది.(సెకండ్) డిన్నర్‌కి నిద్ర పోవడానికి మధ్య తక్కువ సవయం ఉంటే తిన్నది జీర్ణం కాదు. ఫలితంగా నిద్ర సరిగ్గా పట్టదు. రెండోసారి తిన్నది శరీర అవసరాలకు ఉపయోగపడదు. అప్పటికే మొదటి డిన్నర్ నుంచి తయారైన గ్లూకోస్ శరీరానికి కావాల్సిన శక్తినిస్తుంది. సెకండ్ డిన్నర్‌లో తిన్న ఆహారం జీర్ణమైన తర్వాత కొవ్వుగా మారి, శరీర బరువును పెంచుతుంది. పార్టీలు, స్నేహితులతో షికార్లు చేస్తూ దాబా హోటళ్లు, రెస్టారెంట్లలో అర్ధరాత్రి తినేవాళ్లలో చాలామంది డబుల్ డిన్నర్ ఆరగించేవాళ్లే! ఇలా తినడం సరదాగా ఉంటుంది. కానీ, ఆరోగ్యానికి మాత్రం తీవ్రంగా హాని చేస్తుంది.సమయానికి పడుకునేవాళ్లకు తొందరగా రాత్రి భోజనం చేయడం మేలు చేస్తుంది. కానీ, ఆలస్యంగా పడుకునేవాళ్లు తొందరగా భోజనం చేస్తే ఆకలి సమస్య, అమితంగా తినడం సమస్యలు తప్పవు. కాబట్టి పడుకునే వేళల్ని, తినే వేళల్ని వృత్తికి తగ్గట్టుగా మార్చుకోవాలి.ఎన్ని గంటలకు పడుకుంటారో, దానికి మూడు గంటల ముందు తినడానికి ప్లాన్ రెడీ చేసుకోవాలి.రాత్రివేళ ఒకేసారి తినే పద్ధతి పాటించాలి. పగలు తిన్నట్టుగా భోజనం తర్వాత మరేదీ తినకూడదు.తిన్న తర్వాత నడవడం, ఏదైనా చిన్న పని చేస్తూ ఉండాలి. అప్పుడు తిన్న ఆహారం జీర్ణమవుతుంది. అధిక బరువు, ఆకలి, నిద్ర సమస్యలు ఉండవు.రాత్రి భోజనంలో ప్రొటీన్, ఫైబర్, హెల్తీ ఫ్యాట్ ఉండేలా చూసుకుంటే తేలికగా జీర్ణమవుతుంది. ఆకలి సరిగా ఉంటుంది.

# బరువు తగ్గాలనుకునే వారికి అసలు గ్రీన్ టీ ఎలా సహాయం చేస్తుంది..



**హైదరాబాద్ పెన్ పవర్:** అధికంగా ఉండే మన శరీర బరువే అనేక అనారోగ్య సమస్యలకు దారి తీస్తుంది. ఈ విషయాన్ని వైద్యులు తరుచూ చెబుతూ ఉండడంతో మనలో చాలా మందికి ఆరోగ్యం మీద స్పృహ వచ్చిందనే చెప్పవచ్చు.దీంతో శరీర బరువును అదుపులో ఉంచుకోవడానికి మనలో చాలా మంది అనేక రకాల ప్రయత్నాలు చేస్తున్నారు. రోజూ వ్యాయామం చేయడం, కఠినమైన ఆహారాన్ని తీసుకోవడం, తగినంత నీటిని తాగడం, అధిక క్యాలరీలను తగ్గించడం, ఇష్టమైన ఆహారాన్ని వదులుకోవడం ఇలా అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక బరువు తగ్గాలని ఆహారాన్ని కూడా తక్కువగా తీసుకుంటూ ఉంటారు. దీంతో ఆకలితో అనేక బాధలు పడుతూ ఉంటారు. అయితే బరువు తగ్గాలనుకునే వారు అనవసరమైన ఆకలి బాధలు పడాల్సిన అవసరం లేదని వైద్యులు సూచిస్తున్నారు. అలాగే ఆకలి బాధలను నియంత్రించడానికి ఒక చిట్కాను కూడా చెబుతున్నారు.ఆకలిని నియంత్రిస్తుంది..బరువు తగ్గడానికి ప్రయత్నించే వారు గ్రీన్ టీని తీసుకోవడం మంచిదని వారు చెబుతున్నారు. గ్రీన్ టీ లో ఎపిగాల్లోకాచెటిన్ గాలేట్ ( ఇజిసిజి) అనే సమ్మేళనం ఉంటుంది. ఇది ఆకలిని నియంత్రించే అడిపోనెక్టిన్ అనే హార్మోన్ ను ఎక్కువగా ఉత్పత్తి చేయడంలో సహాయపడుతుంది. ఆకలి నియంత్రణలో ఉండడం వల్ల అతిగా తినాలనే కోరిక తగ్గుతుంది. చాలా మంది బరువు తగ్గాలనుకున్నప్పటికీ ఆకలిని నియంత్రించుకోలేక ఏదో ఒకటి తింటూ ఉంటారు. అలాంటి వారు గ్రీన్ టీని తీసుకోవడం వల్ల ఆకలి తగ్గి బరువును అదుపులో ఉంచుకోగలుగుతారు. అలాగే కొందరిలో విపరీతమైన ఆకలి ఉంటుంది. ఆకలిని వాళ్లు అస్సలు తట్టుకోలేక ఎప్పుడూ చూసినా తింటూనే ఉంటారు. అలాంటి వారు కూడా గ్రీన్ టీని తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది.చక్కెర స్థాయిలు అదుపులో..మీరు ఆకలిని నియంత్రించుకోవాలనుకుంటే ఇజిసిజి అధికంగా ఉండే గ్రీన్ టీని తాగడం మంచిది. అంతేకాకుండా గ్రీన్ టీని తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. గ్రీన్ టీని తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు అదుపులో ఉంటాయి. తద్వారా గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది.బరువు తగ్గాలనుకునే వారు గ్రీన్ టీని తాగడంతో పాటు అనవసరమైన ఆకలిని నియంత్రించుకోవడానికి భోజనానికి ముందు ఇసాబ్‌గోల్ తీసుకోవడం చేయాలి. అలాగే ఆహారంలో ఎక్కువగా ప్రోటీన్, ఫైబర్ ఉండేలా చూసుకోవాలి. దీంతో ఎక్కువ సమయం ఆకలి అవ్వకుండా ఉంటుంది. చిరుతిండి తినాలనే కోరిక తగ్గుతుంది. బరువు తగ్గాలనుకునే ప్రయాణానికి ఆకలి బాధలు అడ్డుగా ఉండకూడదు అనుకునే వారు ఆకలిని నియంత్రించుకోవాలనుకునే వారు ఈ చిట్కాను పాటించడం మంచిది.

**పొట్ట చుట్టూ సమస్యలే**
ఫ్యాటీ లివర్, కొలొరెక్టల్, పేగు సంబంధిత వ్యాధులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. అధిక క్యాలరీలతో కూడిన ఆహారం, ప్రాసెస్డ్ ఫుడ్స్, మద్యపానం, అస్థిర జీవనశైలి తదితర కారణాలతో ఈ సమస్యలు యువతలోనే ఎక్కువగా చూస్తున్నాం. మన దేశంలో నమోదవుతున్న కొలొరెక్టల్ క్యాన్సర్ కేసుల్లో 30–40 శాతం మంది 50 ఏళ్లలోపు వారే ఉండటం ఆందోళన కలిగించే అంశం.

**క్యాన్సర్ దాడి**
ఈ మధ్య కాలంలో బ్రెస్ట్, ఒవేరియన్, గ్యాస్ట్రో ఎంటెస్టినల్ వంటి క్యాన్సర్లు ఎక్కువగా యువతలోనే కనిపిస్తున్నాయి. వయసుతో సంబంధం లేని ఈ వ్యాధిపై జన్యు లక్షణాలు, జీవనశైలి, పర్యావరణ ప్రభావాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. మొత్తంగా చూస్తే, గుండె, మెటబాలిక్, కాలేయం, మూత్రపిండాలు, న్యూరాలజీ, జీర్ణవ్యవస్థలకు సంబంధించిన నివారించగల దీర్ఘకాలిక వ్యాధుల్లో 10–15 శాతం పెరుగుదల కనిపిస్తుంది. వీటిలో చాలా వ్యాధులను ప్రారంభదశలో స్క్రీనింగ్, జీవనశైలి మార్పులు, సమయానికి వైద్య పరీక్షల ద్వారా నివారించగలిగినవే.

**వారిపై తీవ్ర ప్రభావం**
మారుతున్న జీవనశైలి, పని ఒత్తిడి కారణంగా కొన్ని రంగాల్లో పనిచేసే ఉద్యోగులు తీవ్రంగా ప్రభావితమవుతున్నారు. అందులో ముఖ్యంగా ఐటీ, సాఫ్ట్‌వేర్ రంగాల్లో పని చేసే యువత రోజుకు పది గంటలకు పైగా ఒకే చోట కూర్చుని పనిచేయడం, సరైన వ్యాయామం లేకపోవడం, ఎక్కువగా జంక్ ఫుడ్, ప్రాసెసింగ్ ఫుడ్‌పై ఆధారపడటం వల్ల అనారోగ్య సమస్యల్లో చిక్కుకుంటున్నారు. దేశ జీడీపీ, అభివృద్ధికి వెన్నెముకగా ఉండాల్సిన యువత అనారోగ్యం పాలవ్వడం దేశ భవిష్యత్తుకే ముప్పుగా పరిణమిస్తున్నది. ఈ అంశాన్ని ప్రతిఒక్కరూ ఒక సామాజిక బాధ్యతగా గుర్తించాలి. జబ్బు వచ్చిన తర్వాత చికిత్స చేయడం కంటే, జబ్బు రాకుండా చూసుకోవడం ప్రధానం అని గ్రహించాలి. జీవనశైలిలో మార్పుల ద్వారా వ్యాధులను వృద్ధాప్యం వరకు వాయిదా వేయవచ్చు.

**ఆర్థికంగా దెబ్బ**
కార్పొరేట్ ఎంప్లాయి మొదలుకొని, సాధారణ ఉద్యోగి వరకు ఆరోగ్య బీమాపై అవగాహన కలిగి ఉంటున్నారు. ఉద్యోగంలో చేరగానే.. హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకుంటున్నారు. అయితే హెల్త్ ఇన్సూరెన్స్ చికిత్సకు అయ్యే ఖర్చును భరిస్తుందేమో కానీ, వ్యాధులను రాకుండా అడ్డుకోదు కదా! ఇక ఇన్సూరెన్స్ లేనివారి పరిస్థితి అగమ్య గోచరం. ఒక వ్యక్తి ఆస్పత్రి పాలైతే.. ఆ భారం కుటుంబం అంతా మోయాల్సి వస్తుంది. తీవ్రమైన వ్యాధులు తలెత్తితే.. ఆర్థికంగా కోలుకోలేని దెబ్బ తగులుతుంది. ఇలా జరగొద్దంటే?ఆరోగ్యమే మహాభాగ్యం అని గుర్తించాలి. అందుకు తగ్గ జీవనశైలిని పాటించాలి. వ్యాధులను ప్రారంభదశలోనే గుర్తించడం వల్ల.. పెను ముప్పును తప్పించుకోవచ్చు.

# 14 రోజులు మానేస్తే..



**హైదరాబాద్ పెన్ పవర్:** పంచదార మన ఆరోగ్యానికి హానికరమని తెలిసినా అదేమీ పట్టించుకోకుండా టీ, కాఫీ, ప్రాసెస్డ్ ఫుడ్స్ పేరుతో ఏదో ఓ రూపంలో తినేస్తుంటారు. అతిగా తీసుకుంటూ బరువుతో పాటు షుగర్ లెవల్స్ పెంచుకుంటూ చాలామంది అనారోగ్యానికి గురవుతుంటారు.అయితే చక్కెరను కనీసం 14 రోజులు పూర్తిగా మానేస్తే ఎలాంటి లాభాలు ఉంటాయో తెలుసుకుందాం.తినే పదార్థాల్లో చెక్కర వేసుకోవడం వల్ల కేవలం కేలరీలు మాత్రమే పెరుగుతాయనుకుంటారు. అది మాత్రమే కాదు ఆకలి, క్రేవింగ్స్, ఇన్సులిన్, లివర్ ఫ్యాట్ లాంటి ఎన్నో సమస్యలు మెల్లగా అంటుకుంటాయి. అయితే, చక్కెరకు దూరంగా ఉండటం చెప్పినంత తేలిక కాదు. షుగర్ మానేయగానే ముందుగా క్రేవింగ్స్ పుడతాయి. దీంతోపాటు తలనొప్పి, అలసట, ఇరిటేషన్, మెదడు పనితీరు తగ్గడం వంటి సమస్యలూ పలకరిస్తాయి. ఎప్పుడెప్పుడు చక్కెరను నోట్లో వేసుకుందామా అనిపిస్తుంటుంది.అయితే, కాస్త ఓపిక పడితే చక్కెరను దూరం పెట్టమని మన శరీరానికి మెదడు చెబుతుంది. అలా ఓ 14 రోజులు చక్కెరకు పూర్తి దూరం పాటిస్తే? బెల్లీ ఫ్యాట్ తగ్గుతుంది. నిద్ర నాణ్యత పెరుగుతుంది. ఫాస్టింగ్ గ్లూకోజ్ ఇంప్రూవ్ అవుతుంది. మెటబాలిజంలో మార్పు వస్తుంది. లివర్ షుగర్ తగ్గుతుంది. చక్కెర మానేయడం పెద్ద కష్టమేమీ కాదు. రోజంతా ఉపవాసం ఉండాల్సిన అవసరం లేదు. పండ్లు పుష్కలంగా తినొచ్చు. ఆహారం తీసుకోవచ్చు. చక్కెర, చెక్కరతో చేసిన పదార్థాలకు మాత్రం దూరం పాటిస్తే సరి. ఈ పద్నాలుగు రోజులు సాఫ్ట్‌డ్రింక్స్, జ్యూస్‌లు, స్వీటెన్డ్ ఆల్కహాల్ లాంటి వాటిని తీసుకోవద్దు. ఒకసారి ప్రయత్నించి చూడండి.

# విజయ్ హజారే ట్రోఫీలో హైదరాబాద్ కుర్రాడి విధ్వంసం.. డబుల్ సెంచరీ బాదిన అమన్ రావ్

- బెంగాల్‌పై ఆకాశమే హద్దుగా చెలరేగిన 21 ఏళ్ల యువ కెరటం
- ఆడుతున్నది మూడో లిస్ట్ ఏ మ్యాచ్‌లోనే ఈ అరుదైన ఫీట్
- 150 నుంచి 200 పరుగులు కేవలం 20 బంతుల్లోనే పూర్తి
- ఇటీవల ఐపీఎల్ వేలంలో అమన్ రావ్‌ను కొన్న రాజస్థాన్ రాయల్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** విజయ్ హజారే ట్రోఫీలో హైదరాబాద్ యువ బ్యాటర్ అమన్ రావ్ పేరాల సంచలనం సృష్టించాడు. బెంగాల్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆకాశమే హద్దుగా చెలరేగి డబుల్ సెంచరీతో కదం తొక్కాడు. నిరంజన్ షా స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో తాను ఆడుతున్న మూడో లిస్ట్ ఏ మ్యాచ్‌లోనే ఈ అద్భుత ఘనతను సాధించడం విశేషం.ఇన్నింగ్స్ ఆరంభంలో నెమ్మదిగా ఆడిన 21 ఏళ్ల అమన్, తొలి 10 బంతుల్లో 3 పరుగులే చేశాడు. ఓపెనర్ రాహుల్ సింగ్‌తో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పిన తర్వాత గేరు మార్చాడు. 65 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న అతను, 107 బంతుల్లో తన తొలి లిస్ట్ ఏ శతకాన్ని అందుకున్నాడు. శతకం తర్వాత అసలు విధ్వంసం మొదలుపెట్టాడు. 150 పరుగుల మార్కును 134 బంతుల్లో దాటిన అమన్, ఆ తర్వాత మరో 20 బంతుల్లోనే 200 పరుగుల మైలురాయిని చేరుకోవడం అతని దూకుడుకు నిదర్శనం. చివరి ఓవర్‌లో డబుల్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అతని ఇన్నింగ్స్‌లో 12 ఫోర్లు, 13 భారీ సిక్సర్లు ఉన్నాయి.ఈ ప్రదర్శనతో హైదరాబాద్ జట్టు 5 వికెట్ల నష్టానికి 352 పరుగుల భారీ స్కోరు సాధించింది. విజయ్ హజారే ట్రోఫీ చరిత్రలో ఇది కేవలం తొమ్మిదో డబుల్ సెంచరీ కాగా, లిస్ట్ ఏ ఫార్మాట్‌లో ద్విశతకం సాధించిన 15వ భారత బ్యాటర్‌గా అమన్ రికార్డు సృష్టించాడు. గత డిసెంబర్‌లో జరిగిన ఐపీఎల్ 2026 వేలంలో అమన్‌ను రాజస్థాన్ రాయల్స్ జట్టు రూ.30లక్షలకు కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే.

# కంబ్యాక్ లో అదరగొట్టిన అయ్యర్, సిరాజ్.. గిల్, జైశ్వాల్, రాహుల్ ఫ్లాప్






**హైదరాబాద్ పెన్ పవర్:** న్యూజిలాండ్ తో జరగబోయే వన్డే సిరీస్ కు ముందు టీమిండియా క్రికెటర్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. డొమెస్టిక్ క్రికెట్ లో జరుగుతున్న విజయ్ హజారే ట్రోఫీలో మ్యాచ్ లు ఆడుతూ ఫామ్ లోకి వచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. సీనియర్ ప్లేయర్స్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ మినహాయిస్తే దాదాపు అందరూ టీమిండియా క్రికెటర్లు మంగళవారం (జనవరి 6) విజయ్ హజారే ట్రోఫీలో మ్యాచ్ ఆడారు. గాయం నుంచి కోలుకున్న శుభమాన్ గిల్, శ్రేయాస్ అయ్యర్ తో పాటు జైశ్వాల్, కేఎల్ రాహుల్, మహమ్మద్ సిరాజ్ మ్యాచ్ ఆడారు. వీరిలో ఎవరు విఫలమయ్యారో.. ఎవరు బాగా ఆడారో ఇప్పుడు చూద్దాం..

రీ ఎంట్రీ లో ముంబై కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టిన శ్రేయాస్ అయ్యర్ తొలి మ్యాచ్ లో హాఫ్ సెంచరీతో రాణించాడు. హిమాచల్ ప్రదేశ్ పై 82 పరుగులు చేసి అదరగొట్టాడు. ముంబై టాప్ స్కోరర్ అయ్యర్ కావడం విశేషం. ఈ ఇన్నింగ్స్ తో న్యూజిలాండ్ తో సిరీస్ కు ముందు అయ్యర్ ఫామ్, ఫిట్ నెస్ పై ఉన్న సందేహాలు తొలగిపోయాయి.

**శుభమాన్ గిల్:**
టీమిండియా కెప్టెన్ శుభమాన్ గిల్ ఇంకా గాడిలో పడలేదు. పేలవ ఫామ్ కారణంగా టీ20 జట్టులో స్థానం కోల్పోయిన గిల్.. గాయం తర్వాత కోలుకొని ఆడిన తొలి మ్యాచ్ లో 11 పరుగులే చేసి నిరాశపరిచాడు. ఆస్ట్రేలియా సిరీస్ తర్వాత సౌతాఫ్రికాతో వన్డే సిరీస్ కు దూరమైన గిల్.. న్యూజిలాండ్ తో జరగబోయే సిరీస్ లో టీమిండియా వన్డే జట్టుకు కెప్టెన్ గా వ్యవహరించనున్నాడు.

**కేఎల్ రాహుల్:**
వికెట్ కీపర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ విజయ్ హజారే ట్రోఫీలో విఫలమయ్యాడు. రాజస్థాన్ పై కేవలం 25 పరుగులే చేసి ఔటయ్యాడు. రాహుల్ భారత వన్డే జట్టులో ప్రధాన వికెట్ కీపర్. ప్లేయింగ్ 11 లో ఖచ్చితంగా అంటాడు. కేఎల్ ప్రస్తుతం వన్డే, టెస్ట్ ఫార్మాట్ లో ఆడుతున్నాడు. టీ20ల్లో ఈ వెటరన్ ప్లేయర్ కు ఛాన్స్ దక్కడం లేదు.

**యశస్వి జైశ్వాల్:**
విజయ్ హజారే ట్రోఫీలో జైశ్వాల్ నిరాశపరిచాడు. హిమాచల్ ప్రదేశ్ తో జరిగిన మ్యాచ్ లో కేవలం 15 పరుగులే చేసి పెవిలియన్ కు చేరాడు. టీమిండియా బ్యాకప్ ఓపెనర్ యశస్వి జైస్వాల్ గత నెలలో సౌతాఫ్రికాపై జరిగిన చివరి వన్డేలో సెంచరీతో సత్తా చాటిన సంగతి తెలిసందే. దీంతో కివీస్ తో జరగబోయే సిరీస్ లో బ్యాకప్ ఓపెనర్ గా స్థానం సంపాదించుకున్నాడు.

**మహమ్మద్ సిరాజ్:**
చాలా నెలల తర్వాత భారత వన్డే జట్టులో స్థానం సంపాదించిన ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ సిరాజ్.. న్యూజిలాండ్ తో సిరీస్ కు ముందు ఫామ్ లోకి వచ్చాడు. విజయ్ హజారే ట్రోఫీలో బెంగాల్ తో జరిగిన మ్యాచ్ లో మూడు వికెట్లు పడగొట్టి రాణించాడు. కివీస్ తో జనవరి 11 నుంచి జరగబోయే వన్డే సిరీస్ లో సిరాజ్ ప్లేయింగ్ 11 లో ఉండడం దాదాపు ఖాయమైంది.

# హైదరాబాద్ బౌలింగ్ ఆశాకిరణం.. నెట్స్‌లో దినేశ్ కార్తీక్‌ను బెంబేలెత్తించిన SRH బౌలర్..




**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026లో సన్ రైజర్స్ హైదరాబాద్ బౌలింగ్ లో బలహీనంగా ఉన్న సంగతి తెలిసిందే. బ్యాటింగ్ లో హైదరాబాద్ జట్టుకు తిరుగు లేదు. టాపార్డర్, మిడిల్ ఆర్డర్ పవర్ హిట్టర్లతో నిండిపోయింది. ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మతో పాటు క్లాసన్, లివింగ్ స్టోన్, ఇషాన్ కిషాన్, నితీష్ కుమార్ రెడ్డి జట్టులో ఉన్నారు. వీరందరూ అంతర్జాతీయ క్రికెట్ లో స్టార్ హిట్టర్లుగా పేరొందినవారే. అయితే సన్ రైజర్స్ అసలు సమస్య అంతా బౌలింగే. కెప్టెన్ పాట్ కమ్మిన్స్ మినహాయిస్తే మిగిలివారికి అనుభవం లేదు. హర్షల్ పేటల్, ఉనాద్కట్ గతంలో రాణించినా ప్రస్తుతం ఫామ్ లేక ఇబ్బంది పడుతున్నారు.

బౌలింగ్ గురించి ఆందోళన చెందుతున్న సమయంలో సన్ రైజర్స్ కు బీహార్ ఫాస్ట్ బౌలర్ సాకిబ్ హుస్సేన్ ఆశాకిరణంగా కనిపించాడు. ఐపీఎల్ వేలంలో సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టు సాకిబ్ హుస్సేన్ ను రూ.30 లక్షల రూపాయలకు కొనుగోలు చేసింది. పెద్దగా అంచనాలు లేకుండా జట్టులోకి వచ్చిన సాకిబ్ సంచలనంగా మారేలా కనిపిస్తున్నాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ (రా=ఎ) తరఫున బరిలోకి దిగనున్న సాకిబ్ నెట్స్‌లో నిప్పులు చెరుగుతున్నాడు. ప్రాక్టీస్ సెషన్ లో భాగంగా స్వింగ్, బౌన్సర్లతో విరుచుకుపడుతున్నాడు. నెట్స్ లో వెటరన్ ఫినిషర్ దినేశ్ కార్తీక్ సైతం సాకిబ్ హసన్ బౌలింగ్ ఆడలేకపోతున్నాడు. బంతి అనూహ్యంగా స్వింగ్ అవ్వడంతో పాటు బౌన్స్ కూడా అవుతుంది. తన బౌలింగ్ తో దినేష్ కార్తీక్ ను బెంబేలెత్తించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సాకిబ్ సూపర్ బౌలింగ్ చూసి సన్ రైజర్స్ ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. ఈ మెరుపు బౌలింగ్ చూసి ఖుషీ అవుతున్న కావ్యా మారన్ అండ్ టీమ్, ఎస్‌ఆర్‌హెచ్ బౌలింగ్ బలహీనతలకు సాకిబ్ చెక్ పెడతాడని ఆశిస్తున్నారు. ఐపీఎల్ లో గతంలో సాకిబ్ కోల్ కతా నైట్ రైడర్స్ మత్తులో ఉన్నాడు. 21ఏళ్ళ ఈ పేసర్ కు ఒక్క మ్యాచ్ లో కూడా ఆడే అవకాశం రాలేదు. మరి సన్ రైజర్స్ అవకాశం ఇస్తుందా ఇస్తే ఎలా ఆడతాడో ఆసక్తికరంగా మారింది.

# మూడో సీజన్ కు రెడీ అవుతున్న సూపర్ హిట్ వెబ్ సిరీస్



నోరా ఫతేహి గోల్డ్-కాంస్య కార్సెట్ గౌనులో స్టన్స్





ఆషికా రంగనాథ్ అద్భుతమైన బీచ్ లుక్‌తో ట్రాపికల్ బ్లిస్‌లో మునిగిపోయింది

భాషతో సంబంధం లేకుండా ఓటీటీ ఆడియన్స్ ను ఎన్నో వెబ్‌సిరీస్‌లు విశేషంగా అలరిస్తున్నాయి. అలా 2022లో వచ్చిన తమిళ వెబ్‌సిరీసే సుజల్: ది వొర్టెక్స్. కాథిర్, ఐశ్వర్యా రాజేష్, ఆర్. పార్తిబన్, హరీష్ ఉత్తమన్, శ్రియా రెడ్డి కీలక పాత్రల్లో ఈ వెబ్ సిరీస్ రూపొందింది. క్రైమ్ థ్రిల్లర్ వెబ్‌సిరీస్‌గా వచ్చిన దీన్ని పుష్కర్– గాయత్రి కలిసి సృష్టించారు.

**మొదటి రెండు సీజన్లకు మంచి రెస్పాన్స్**

అయితే ఇప్పటికే సుజల్ నుంచి రెండు సీజన్లు రిలీజవగా, సౌత్ ఇండియన్ వెబ్ సిరీస్‌ల్లో దీనికి ఆడియన్స్ నుంచి మంచి ఆదరణ దక్కింది. మొదటి రెండు సీజన్లు అమెజాన్ ప్రైమ్ వీడియోలో అందుబాటులో ఉన్నాయి. ఆల్రెడీ రిలీజైన రెండు సీజన్లకు స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ లో మంచి వ్యూస్ తో పాటూ ఆదరణ కూడా సొంతం చేసుకున్నాయి. ఇదిలా ఉంటే ఈ వెబ్ సిరీస్ గురించి ఇప్పుడో ఇంట్రెస్టింగ్ అప్డేట్ వినిపిస్తోంది.

**సుజల్ మూడో సీజన్ పై వర్క్ చేస్తున్న మేకర్స్**

నిర్మాతలు ఈ వెబ్ సిరీస్ యొక్క మూడో సీజన్ పై వర్క్ చేస్తున్నారని, దానికి సంబంధించిన షూటింగ్ 2026 ఆగస్ట్ నుంచి మొదలవుతుందని చెప్తున్నారు. కాగా దీనిపై మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. సుజల్: ది వోర్టెక్స్ మొదటి రెండు సీజన్లకు బ్రహ్మ జి, అనుచరణ్ మురుగయ్యన్, సర్జున్ దర్శకత్వం వహించగా, వాల్ వాచర్ ఫిల్మ్స్ నిర్మించింది.తమిళంతో పాటూ 30 భాషల్లో రిలీజైన ఈ సిరీస్ మంచి సక్సెస్ ను అందుకోవడంతో పాటూ ఎన్నో ఓటీటీ అవార్డులను కూడా సొంతం చేసుకుంది. సామ్ సి.ఎస్ నేపథ్య సంగీతం అందించిన ఈ సిరీస్ తమిళంతో పాటూ తెలుగు, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో రిలీజ్ కాగా, ఈ సిరీస్ కు పుష్కర్– గాయత్రి అందించిన స్క్రీన్ ప్లే మేజర్ ప్లస్ పాయింట్ గా నిలిచింది. సిరీస్ లోని ట్విస్టులు ఆడియన్స్ ను విపరీతంగా అలరిస్తాయి.

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At Shop No: 9, Bunny Xerox, Rtc Comlex, Kavali, Nellore Dist, Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2835" e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965